

కంటి చూపును పోగొట్టే గ్లకోమా

- నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం
- 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి
- నేడు ప్రపంచ గ్లకోమా డే



-8లో

15 మాస్టర్ ప్లాన్ రోడ్లు అభివృద్ధి

ఏడాదిలోగా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్న వీఎంఆర్‌డీఏ

- క్షేత్రస్థాయి పర్యటనల్లో పెద్దలు
- భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యే నాటికి జాతీయ రహదారులకు అనుసంధానమై ఉన్న పలు రహదారుల విస్తరణకు ప్రణాళిక



అడవివరం నుంచి శొంఠ్యాం మార్గాన్ని పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్, కమిషనర్ తదితరులు.



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమయ్యే నాటికి వివిధ ప్రాంతాల నుంచి జాతీయ రహదారులను కలుపుతూ అభివృద్ధి చేయాలని నిర్ణయించిన 15 మాస్టర్ ప్లాన్ రహదారులను పూర్తిచేయాలని వీఎంఆర్‌డీఏ కృతనిశ్చయంతో ఉంది.

ఇటీవల అసెంబ్లీలో ఇదే అంశంపై విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు ప్రశ్నలు అడిగిన సంగతి తెలిసిందే. భోగాపురం విమానాశ్రయానికి విశాఖ నుంచి వెళ్లాలంటే ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయని, ఫ్లైఓవర్లు నిర్మించాలని, రహదారులను విస్తరించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, నెల్లిమర్ల ఎమ్మెల్యే మాధవి, తదితరులు కోరారు. దీనిపై పురపాలక శాఖా మంత్రి నారాయణ సమాధానమిస్తూ మెట్రో రైలు ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలిసందిగా కేంద్రాన్ని కోరామని, దానికి గ్రీన్‌సిగ్నల్ లభిస్తే నాలుగేళ్లలో పూర్తిచేస్తామని చెప్పారు. ఈలోగా ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో వివిధ ప్రాంతాల ప్రజలు ఎన్‌హెచ్-16ను, అనకాపల్లి-పెందుర్తి జాతీయ రహదారిని చేరుకోవడానికి పలు గ్రామాల నుంచి కనెక్టింగ్ రహదారులు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వీఎంఆర్‌డీఏ గతంలోనే వాటిని మాస్టర్ ప్లాన్ రహదారులుగా ప్రకటించిందని, కొన్ని కొంత మేరకు పూర్తయ్యాయని, మరికొన్నింటికి భూసేకరణ జరిగిందని, మరికొన్నింటికి భూమిని తీసుకోవలసి ఉందని వివరించారు. ఏదేమైనా ఈ రహదారులు అన్నింటిని ఏడాదిలోగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్‌కు మంత్రి లోకేశ్, కమిషనర్‌కు పురపాలక శాఖా మంత్రి నారాయణ ఫోన్లు చేసి ఆ మాస్టర్ ప్లాన్ రహదారుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వాటిని పూర్తి చేయడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. దీంతో చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ రమేశ్, చీఫ్ ఇంజనీర్ వినయకుమార్, సీయూపీ శిల్ప, ఎస్ఈలు భవానీ శంకర్, బలరామరాజులతో కలిసి మంగళవారం ఆయా మార్గాలను పరిశీలించారు.

వీఎంఆర్‌డీఏ నిధులతోనే నిర్మాణం

- ఎం.ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో ప్రయాణం సులభతరం చేసేందుకు అభివృద్ధి చేస్తున్న ఈ 15 మాస్టర్ ప్లాన్ రహదారులకు వీఎంఆర్‌డీఏనే నిధులు సమకూరుస్తుంది. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశం మేరకు ఏడాదిలోగా అన్నీ పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాము. అందులో ఒకటి ఇప్పటికే పూర్తయింది. ఒక రహదారికి డీఎస్ నిధులు సమకూరుస్తుంది.

8 గ్రీన్‌ఫీల్డ్ రహదారులు

కె.విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ

కొత్తగా, ఇప్పుడున్న వాటిని అభివృద్ధి చేస్తున్న 15 రహదారుల్లో 8 పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్ మార్గాలు. వాటికి కొత్తగా భూసేకరణ చేయాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ భూముల్లో నుంచే నిర్మిస్తాం. జనసాంద్రత తక్కువగా ఉండే ప్రాంతాల్లోనే వస్తాయి. ప్రజల నిర్మాణాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. కొన్ని మార్గాలలో నిర్మాణాలకు జీవీఎంసీ టీడీఆర్‌లు పెండింగ్ పెట్టడం వల్ల పనులు ఆగాయి. వాటిని కూడా త్వరగా పూర్తిచేయడానికి యత్నిస్తాం.

తొలి ప్రాధాన్యం ఆ మార్గానికే...

1. అడవివరం బీఆర్‌టీఎస్

... మిగతా 6వ పేజీలో

ఫీజు బకాయిల పాపం ఎవరిది?

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏనాడూ సక్రమంగా చెల్లించని వైనం

- అనేక ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాలేజీ యాజమాన్యాలకు హామీ
- 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జనవరిలో ఫీజులు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని 39,781 మంది విద్యార్థులకు రూ.191 కోట్లు జమ
- సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని విద్యార్థులకు రూ.5.5 కోట్ల బకాయిలు విడుదల



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ 'యువత పోరు' పేరుతో బుధవారం వైసీపీ ఆందోళన చేపడుతుండడంపై విద్యార్థులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. గడిచిన ఐదేళ్లుగా విద్యార్థుల ఇబ్బందులను పట్టించుకోని వైసీపీ నాయకులు...ఇప్పుడు రాజకీయ ప్రయోజనం కోసం పోరుకు దిగుతుండడాన్ని వారంతా తప్పుబడుతున్నారు. ప్రభుత్వం ఉన్నప్పుడు విద్యార్థులకు ఒక్కసారి కూడా సకాలంలో ఫీజులు చెల్లించని వైసీపీ...ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని ఫీజులు చెల్లించాలని నిలదీయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాల పేర్లను మార్చేసింది. అలాగే కాలేజీలకు నేరుగా ఫీజు చెల్లించే విధానాన్ని పక్కనపెట్టి విద్యార్థుల తల్లి అకౌంట్‌లో జమ చేసే విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ నిర్ణయమే విద్యార్థుల పాలిట శాపంగా మారింది. అప్పటివరకూ కాలేజీలకు ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తూ వస్తుండడంతో ఒకవేళ జాప్యం జరిగినా విద్యార్థులను యాజమాన్యాలు ఏమీ అనలేని పరిస్థితి ఉండేది. అయితే, వైసీపీ ప్రభుత్వం తెచ్చిన నూతన విధానంతో కాలేజీలకు, ప్రభుత్వానికి మధ్య ఆర్థికపరమైన అంశాల్లో సంబంధం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం ఆయా క్వార్టర్స్‌కు సంబంధించిన ఫీజులను జమ చేసినా, చేయకపోయినా కాలేజీ యాజమాన్యాలు మాత్రం విద్యార్థులపై ఒత్తిడి చేస్తూ వచ్చేవి. వైసీపీ ప్రభుత్వం ఒక్క ఏడాది మినహా మిగిలిన నాలుగేళ్లూ కనీసం రెండు క్వార్టర్స్‌కు సంబంధించిన ఫీజు చెల్లింపును మరుసటి విద్యా సంవత్సరానికి వాయిదా వేసుకుంటూ వచ్చింది. దీనివల్ల వేలాది మంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ కాలేజీలకు ఫీజులు చెల్లించాల్సి వచ్చింది.

భారీగా బకాయిలు..

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల హయాంలో సుమారు ఏడాది పాటు విద్యార్థులకు ఫీజులను చెల్లించలేదు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక క్వార్టర్ ఫీజును వందలాది మంది విద్యార్థులకు బకాయి పెట్టగా, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక్క క్వార్టర్ ఫీజు మాత్రమే చెల్లించింది. అది కూడా గడిచిన ఏడాది మార్చిలో ఎన్నికలకు కొద్దిరోజులు ముందు జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. మిగిలిన మూడు క్వార్టర్స్‌కు సంబంధించిన ఫీజులను పట్టించుకోలేదు. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడం, ప్రభుత్వం మారిపోవడంతో విద్యార్థులు మూడు క్వార్టర్స్‌కు సంబంధించిన ఫీజులను నష్టపోవాల్సి వచ్చింది.

జిల్లాలో డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులు అభ్యసిస్తున్న 44,177 మంది విద్యార్థులకు సుమారు రూ.103 కోట్లు వరకు బకాయి పెట్టి వైసీపీ దిగిపోయింది. అలాగే,

... మిగతా 6వ పేజీలో

సచివాలయాల్లో సాంకేతిక సిబ్బంది హేతుబద్ధీకరణ

- ఒక్కొక్కరికి రెండు సచివాలయాలు కేటాయింపు
- జాబితాలో వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్, ఫిషరీస్, పశు సంవర్ధక శాఖ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్, ఏఎన్ఎం, ఇంజనీరింగ్, ప్లానింగ్, ఎమినిటీస్ సెక్రటరీలు
- మిగులు సిబ్బంది ఆయా శాఖలకు బదలాయింపు
- 15వ తేదీలోగా ప్రక్రియ పూర్తి



విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

గ్రామ/వార్డు సచివాలయాల్లో సాంకేతిక సిబ్బంది హేతుబద్ధీకరణకు కసరత్తు జరుగుతోంది. ఇకపై సాంకేతిక సిబ్బంది రెండేసి సచివాలయాల్లో సేవలు అందించాల్సి ఉంటుంది. ఈ మేరకు దగ్గర దగ్గరగా ఉన్న సచివాలయాలను మ్యాపింగ్ చేస్తున్నారు. ఇతర సిబ్బంది మాత్రం ఏ సచివాలయంలో ఉన్నవారు అక్కడే పనిచేస్తారు.

జిల్లాలోని నాలుగు గ్రామీణ మండలాల్లో 56, జీవీఎంసీలో 551...మొత్తం 607 సచివాలయాలు ఉన్నాయి. నాలుగు గ్రామీణ మండలాల్లో 514 మంది, జీవీఎంసీ పరిధిలో

... మిగతా 6వ పేజీలో

ఆస్పత్రుల్లో వైద్య సేవలపై ఆరా

- ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్న ప్రభుత్వం
- వైద్యులు, సిబ్బంది పనితీరు, అవినీతి, మందుల పంపిణీ, పరిశుభ్రతపై ప్రశ్నలు
- మందులు ఇవ్వడం లేదని సగానికిపైగా సమాధానం
- ఆ సమాచారాన్ని విశ్లేషించి... ఇక్కడి అధికారులకు పంపుతున్న ఉన్నతాధికారులు



విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. అనేక ఆస్పత్రుల్లో సేవలు సక్రమంగా అందడం లేదని, వైద్యులు రోగులకు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న ఇబ్బందులను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా ప్రజల నుంచి సమాచారం సేకరిస్తుంది. గడిచిన మూడు నెలలుగా ఈ కార్యక్రమం నడుస్తోంది. ప్రతిరోజూ వందలాది మంది నుంచి సేకరించిన అభిప్రాయాలను విశ్లేషించి, ఆయా ఆస్పత్రుల అధికారులకు వివరాలను పంపుతోంది. జిల్లాలో ప్రభుత్వపరంగా చూస్తే...కేజీహెచ్, ఈఎన్‌టీ, మానసిక వైద్యశాల, ఘోషా ఆస్పత్రి, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి, విమ్స్ వంటివి ఉన్నాయి.

ఈ అంశాలపై సేకరణ

ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా?, డాక్టర్, సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంటోంది?, మీకు ఆస్పత్రిలో డాక్టర్ రాసిన మందులు ఇస్తున్నారా.?, ప్రభుత్వ ఆస్పత్రిలో అవినీతి ఏమైనా ఉందా?, పరిశుభ్రత ఎలా ఉంది?...అని ప్రశ్నలు వేసి సమాధానాలను రాబడుతున్నారు.

మందులు ఇవ్వడం లేదన్న 51 శాతం మంది...

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా?...అన్న ప్రశ్నకు 68.31 శాతం మంది 'ఉంటున్నారని', 31.69 శాతం మంది 'ఉండడం లేదని' సమాధానం చెప్పారు. అలాగే, ఆస్పత్రిలో డాక్టర్ ప్రవర్తన ఎలా ఉందన్న ప్రశ్నకు 65.39 శాతం మంది బాగుందని సమాధానం చెప్పగా, 34.01 శాతం మంది సరిగా ఉండడం లేదంటూ అసంతృప్తి వ్యక్తంచేశారు. సిబ్బంది ప్రవర్తన ఎలా ఉందన్న ప్రశ్నకు 63.91 శాతం మంది బాగుందని, 36.09 శాతం బాగుండడం లేదని సమాధానమిచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ రాసిన మందులు ఇస్తున్నారా?...అనే ప్రశ్నకు 48.89 శాతం మంది ఇస్తున్నారని, 51.1 శాతం మంది ఇవ్వడం లేదని సమాధానమిచ్చారు. ఆస్పత్రుల్లో అవినీతి గమనించారా?...అన్న ప్రశ్నకు 67.52 శాతం మంది లేదని చెప్పగా, 32.48 శాతం మంది ఉందని సమాధానం ఇచ్చారు. ఆస్పత్రిలో పరిశుభ్రత ఎలా ఉందన్న ప్రశ్నకు 53.71 శాతం మంది బాగుందని, 46.29 శాతం బాగుండడం లేదని సమాధానం ఇచ్చారు.

హయగ్రీవ రిజిస్ట్రేషన్లు బంద్

22-ఏలో ఎండాడ భూములు



ప్రభుత్వానికి చెందినదంటూ హయగ్రీవకు కేటాయించిన భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

- తప్పులు చేసినందునే స్వాధీనం చేసుకున్నట్టు కలెక్టర్ స్పష్టీకరణ
- నాడు గజం రూ. 937.5కు తీసుకొని నేడు రూ.41,666.4కు అమ్మకం


విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

ఎండాడలో వృద్ధాశ్రమం పేరుతో హయగ్రీవ ఫార్మ్ అండ్ డెవలపర్స్ తీసుకున్న భూమి 12.51 ఎకరాలను జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు మంగళవారం ప్రభుత్వ భూముల జాబితా 22-ఏలో చేర్చారు. ఆ భూమికి సంబంధించి ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దని మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కలెక్టర్ హరేంధిర ప్రసాద్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఆ భూమిని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం సోమవారం రాత్రి ఆదేశాలు ఇవ్వడంతో కలెక్టర్ మంగళవారం ఉదయమే స్వాధీన ప్రక్రియ ప్రారంభించారు. ఇది రాజకీయ కక్ష సాధింపు కాదని,

... మిగతా 6వ పేజీలో

విద్యుత్ సమస్య పరిష్కారం





నూతన ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన స్విచ్ ఆన్ చేస్తున్న కార్పొరేటర్ బొండా జగన్, ఎలక్ట్రికల్ ఏఈ వీర్రాజు

- తిరుమల నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కూర్మన్నపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

'ఆంధ్రజ్యోతి' చేపట్టిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమంతో జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని తిరుమల నగర్‌లో విద్యుత్ సమస్య పరిష్కారమైంది. జనవరి 28వ తేదీన కాలనీలో నిర్వహించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమానికి హాజరైన అధికారుల దృష్టికి స్థానికులు లోవోల్టేజీ, వీధి దీపాల సమస్యను తీసుకువచ్చారు. దీంతో విద్యుత్ ఏఈ వీర్రాజు స్పందించారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో మంగళవారం వార్డు కార్పొరేటర్ బొండా జగన్, విద్యుత్ ఏఈ వీర్రాజుల చేతుల మీదుగా తిరుమల నగర్ కాలనీ వాసుల సమక్షంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. దీంతో తమ సమస్య పరిష్కారమైందని కాలనీ వాసులు జి.నాగభూషణం, జి.విశ్వేశ్వరరావు తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు విధివిధానాలపై కమిటీ

- స్టీల్ ప్లాంటు యాజమాన్య ప్రతినిధులు
- ఒక్కరిని తొలగించినా సహించేది లేదన్న కార్మిక సంఘ నాయకులు
- అసంపూర్తిగా చర్చలు... 26వ తేదీకి వాయిదా



రీజనల్ లేబర్ కమిషనర్ మొహంతికి వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశంపై నగరంలోని రీజనల్ లేబర్ కమిషనర్ మొహంతి సమక్షంలో మంగళవారం ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘ నాయకుల మధ్య జరిగిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును ఆపాలని కార్మిక సంఘ నాయకులు ప్రస్తావించగా, కంపెనీ పరిస్థితుల దృష్ట్యా సిబ్బంది తగ్గింపునకు చర్యలు చేపట్టామని

... మిగతా 6వ పేజీలో

ముగ్గురు సీఐల బదిలీ -8లో

- రేంజ్‌కు భీమిలి సీఐ సుధాకర్ సరెండర్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	6.09
సహరి (గురు)	4.50



16వ పోలీస్ బెటాలియన్‌లో ఏఆర్సీ ప్రోగ్రాం ముగింపు

కొమ్మాది, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నక్సలైట్ల ప్రభావితప్రాంతాల్లో 24 గంటలు పని చేస్తున్న బెటాలియన్ సిబ్బంది కుటుంబాలతో కలసి సేద తీరటానికి ఏఆర్సీ ట్రైనింగ్ ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందని అడిషనల్ కమాండెంట్ సీహెచ్ పద్మనాభరాజు అన్నారు. మంగళశారం బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించిన ఏఆర్సీ మూడో బ్యాచ్ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమానికి ఆయన హజరయ్యారు. ఉద్యోగ ప్రారంభంలో నేర్చుకున్న పీటీ అండ్ స్ట్రెంత్‌నింగ్ , వెపన్స్ ట్రైనింగ్, సిబ్బంది సర్వీస్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్ర మంలో అసిస్టెంట్ కమాండెంట్లు ఎన్.మురళీధర్, వి.నారాయణరావు, మెడికల్ ఆఫీసర్ శశికాంత్ తదితరులుపాల్గొన్నారు.

బంగ్లామెట్ట పాఠశాలలో డైట్ అధ్యాపకుడు త్రినాథరావు తనిఖీలు



అధ్యాపకులతో మాట్లాడుతున్న త్రినాథరావు

తగరపువలస, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో మంగళవారం డైట్ అధ్యాపకులు ఎస్.త్రినాధరావు తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల అవగాహన స్థాయిలను పరిశీలించారు. పాఠశాలలో నమూనా పాఠాలు బోధించడానికి వస్తున్న శిక్షణ పొందుతున్న టీచర్లకూ పలు సలహాలను అందించారు. ప్రధానోపాధ్యాయులు అప్పలరాజు నుంచి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలల సక్రమ నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, గుణాత్మక విద్యను బోధించడానికి ఉపాధ్యాయులకు వివిధ సలహాలు, సూచనలను అందిస్తున్నామని అన్నారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

- అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలపై పోలీసుల ప్రత్యేక దృష్టి
- నేరాల నియంత్రణకు సత్వర పరిష్కారం
- ట్రాఫిక్ పరిస్థితిని సైతం తెలుసుకునేందుకు అవకాశం

మధురవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెంచడానికి నార్త్‌జోన్ పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు పోలీసులు క్లౌడ్ పెట్రోలింగ్‌ను మధురవాడ, రుషికొండ ఐటీ కంపెనీలపై ఇటీవల ప్రారంభించారు. నార్త్ జోన్ ఏసీపీ ఎస్.అప్పలరాజు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నేరాలు చేసి తప్పించుకొని తిరగడాన్ని క్లౌడ్ పెట్రోలింగ్ చెక్‌పెడుతుంది. ఆకాశంలో డ్రోన్ ఎగురవేసి నిర్దేశించిన ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలను పోలీసులు పసిగడతారు. విశాల తీర ప్రాంతంలో కొండలు విస్తరించి ఉండడంతో నేరాలు చేయడానికి ఆస్కారం ఎక్కువగా ఉంటోందని పోలీసులు భావిస్తున్నారు. ఐటీ హిల్స్ రోడ్డులో బైక్ రేస్‌లు, గంజాయి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వాటివల్ల నేరాలు సంఖ్య పెరుగుతోందని పోలీసులు భావిస్తున్నారు. దీన్ని క్లౌడ్ పెట్రోలింగ్‌తో నియంత్రించే అవకాశం ఉంటుంది.

ఏదైనా ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు పోలీసులకు అనుమానం వస్తే అక్కడ ఆకాశంలోకి డ్రోన్ కెమెరాలు పంపిస్తారు. అక్కడ నుంచి వచ్చిన వీడియో ఫుటేజ్ ఆధారంగా నిందితుల కార్యకలాపాలను గుర్తించి వెంటనే రంగప్రవేశం చేస్తారు.

ప్రయోగాత్మకంగా నార్త్‌జోన్‌లో..

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నార్త్‌జోన్‌లో డ్రోన్ కెమెరాలతో



ఐటీ కంపనీల పరిసర గ్రామాల్లో డ్రోన్ కెమెరాతో తీసిన ఫొటో

గస్తీ చర్యలను పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల శ్రీకారం చుట్టారు. పీఎం పాలెం పోలీసుల ఆధ్వర్యంలో రుషికొండ, ఐటీ సెజ్ కొండలు పరిసరాల్లో డ్రోన్‌లు ఎగురవేశారు. అలాగే ఈ విధానం వల్ల నగరంలో ట్రాఫిక్ పరిస్థితిని కూడా ఎప్పటికప్పుడు సమీక్షించి ప్రజల ఇబ్బందులను సైతం తొలగించవచ్చని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

నేడు అనంత పద్మనాభుడి తెప్పోత్సవం



- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు

పద్మనాభం, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంతపద్మనాభుడి కల్యాణోత్సవాల్లో భాగంగా ఈనెల 12న స్వామివారి తెప్పోత్సవం నిర్వహణకు దేవస్థానం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉభయ దేవేరులతో కూడిన అనంతుని ఉత్సవ విగ్రహాలను ఆరోజు రాత్రి 7 గంటలకు కుంతీమాధవస్వామి ఆలయం నుంచి ఉత్సవం నిర్వహించే కన్నయ్య కోనేరు వద్దకు పల్లకీపై ఊరేగింపుగా తీసుకువెళతారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు చేసిన తరువాత శ్రీదేవి, భూదేవీ సమేతంగా స్వామివారు ప్రత్యేకంగా రూపొందించిన తెప్పపై కోనేరులో విహరిస్తారు. ఈ ఉత్సవం ఆద్యంతం భక్తులు తన్మయత్వంతో వీక్షిస్తారు. ఈ నేపథ్యంలో తెప్పోత్సవం నిర్వహించనున్న కన్నయ్య కోనేరు ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఉత్సవం నిర్వహణకు అవసరమైన నీటితో నింపారు. కోనేరు ప్రాంతాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. చింతలవలస నుంచి తెప్పను తీసుకొస్తారు. ఉత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని దేవస్థానంఅధికారులు కోరారు.



అనంతుడి ఉత్సవ విగ్రహాలు

సముద్రంలో ఫార్మా వ్యర్థాలను కలపడం నియంత్రించాలి

మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సంఘం డిమాండ్

తగరపువలస, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం చిప్పాడ దివీస్ వద్ద కర్మాగారం తమ వ్యర్థ పదార్థాలను గొట్టాల ద్వారా అన్నవరం సముద్రంలో కలపడం వల్ల చేపలు చని పోతున్నాయని, దీంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారని మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం తగరపువలసలో సంఘం అధ్యక్షుడు అలిపిల్లి యల్లాజీ, మహిళా అధ్యక్షురాలు పేర్ల ధనలక్ష్మి, కె.సంధ్యారాణి, కార్యదర్శి ఎం.ఎల్లాజీ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కంపెనీ నుంచి పైపుల ద్వారా కలుషిత వ్యర్థాలను సముద్రంలో వదులుతున్నారని, ఫిల్టరు వేసి వదలాలని నిబంధనలు ఉన్నా ఆ విధంగా చేయడం లేదన్నారు. ఇటీవల ఎన్నో తాబేళ్లు చనిపోయి తీరంలోకి కొట్టుకుని వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం వల్ల పరిసర గ్రామాల ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారన్నారు.ఈ విషయంలోగతంలో జిల్లా అధికారులకు పిర్యాదులు చేశామని, అయినా స్పందన లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకుంటే మత్స్యకార కుటుంబాలతో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



మాట్లాడుతున్న మత్స్యకారుల అభివృద్ధి సంఘం నేతలు

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకస్వాములు

సింహాచలం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఆసీనులను చేశారు. భక్తుల సమక్షంలో వేదమంత్రాలు పఠిస్తూ జీలకర్ర, బెల్లం, మాంగళ్యధారణ జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

పరిశుభ్రతలో విశాఖను నంబరు వన్‌గా నిలబెట్టాలి



జిందాల్ పవర్‌ప్లాంటును పరిశీలిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

కొమ్మాది, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టి విశాఖను మొదటిస్థానంలో నిలపాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి అధికారులు, కార్పొరేటర్లు, ప్రజలను కోరారు. మంగళవారం ఆయన కాపులుప్పాడ డంపింగ్ యార్డును, జిందాల్ పవర్‌ప్లాంటును పరిశీలించారు. జిందాల్ ప్రతినిధులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పలు విషయాలను ఆయన జిందాల్ ప్రతినిధులను అడిగి తెలుసుకుని ప్రధాన ఇంజనీర్ శివప్రసాదరాజుకు కొన్ని సూచనలు చేశారు. ఎగ్జిక్యూటివ్ అర్జునరావు, జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్ వర్మ, పర్యవేక్షక ఇంజనీర్లు దామోదరరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు పాల్గొన్నారు.

చర్చి ఉత్సవాలు నేడు ప్రారంభం

భీమునిపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి శతాబ్దిన్నర ఉత్సవాలు బుధవారం సాయంత్రం ప్రారంభమవుతాయని ఆ చర్చి సంఘం అధ్యక్షుడు కెఎస్ఎం సుధాకర్ తెలిపారు. 1876లో ప్రారంభించిన ఈ చర్చి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కనక దుర్గాంబిక జాతర



అలంకరణలో దుర్గాంబికా అమ్మవారు

కొమ్మాది, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొమ్మాది సాయిరాంకాలనీలో కనక దుర్గాంబికా అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆఖరిరోజు మంగళవారం కోలాటాలు, పులి వేషాలు, తప్పెటగుళ్లు, డప్పులు, కేరళడ్రమ్ములు, లేడీస్ తీన్‌మార్, కాళీమాత, దాండియా తదితర వాటితో సందడిగా జాతర నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు, మొక్కుబడులు సమర్పించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కొమ్మాది, శివశక్తి నగర్, మధురవాడ, మారికవలస, బోరవానిపాలెం తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కురుమోజు గోవిందరావు, శ్రీనివాసనాయుడు, వై.ఎస్.మూర్తి, బోడసింగి సింహాచలం పాల్గొన్నారు.



జాతరలో పాల్గొన్న ప్రజలు

మహిళలకు రక్షణ కవచం.. పోక్సో చట్టం

సింహాచలం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో ఎదురయ్యే అనేక సమస్యల నుంచి మహిళలకు రక్షణ కవచంలా పోక్సో చట్టం నిలుస్తుందని విశాఖకు చెందిన రెండో అదనపు జ్యుడీషియల్ న్యాయమూర్తి ఎస్.వరలక్ష్మి అన్నారు. ఈ చట్టంపై సింహాచలం దేవస్థానం హైస్కూల్‌లో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొని విద్యార్థినులకు చట్టంపై సమగ్రంగా అవగాహన కల్పించారు. సాధారణంగా పిల్లలపై జరిగే నేరాలు, వాటి నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు చెబుతూనే, విద్యార్థి దశ నుంచి అందరూ చట్టాలపై కనీస పరిజ్ఞానం పొందాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని భాను, గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి వరలక్ష్మి

నేడు వైసీపీ 'యువత పోరు'

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు బకాయిలు, నిరుద్యోగులకు భృతి విడుదల, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలనే డిమాండ్లతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బుధవారం 'యువత పోరు' పేరుతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించబోతోంది. జిల్లా పరిషత్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర పార్టీ సమన్వయకర్త కురసాల కన్నబాబు, జిల్లాలోని వైసీపీ నేతలు, కార్యకర్తలు హాజరవుతారు.

జైలులో రంజాన్ ప్రార్ధనలకు అవకాశం

ఆరిలోవ, మార్చి11 (ఆంధ్రజ్యోతి) రంజాన్ సందర్బంగా కేంద్రకారాగారంలో ముస్లిం సోదరులకు ప్రార్థనలు చేసుకొవడాని ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు కేంద్రకారాగార సూపరింటెండెంట్ మహేష్ తెలిపారు. వారు ప్రతీ రోజు రంజాన్ ప్రార్థనల్లో భాగంగా నమాజ్ చేసుకోవడానికి వారికి నర్మద బ్యారక్ కేటాయించినచెప్పారు జైలులో సుమారు 70 మంది ముస్లింలున్నారని ఆయనతెలిపారు వారికి ప్రభుత్వం ఇస్తున్న(భోజన ఖర్చుని 70 రూపాయలతో వారికి నచ్చిన పండ్లను డ్రైఫ్రూట్స్ అక్కడ ఉన్న క్యాంటీన్ ఇస్తున్నామని తెలిపారు. వారికి ఎటువంటి ఇబ్బందులుకలగకుండా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

ఆమె ఎవరు?

చేజారిన ప్రభుత్వ స్థలంపై కూపీ లాగుతున్న అధికారులు

భీమునిపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): 'చేజారిన ప్రభుత్వ స్థలం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనంపై భీమిలి రెవెన్యూ అధికారులు స్పందించారు. బీచ్‌రోడ్‌లో సుమారు రూ.15 కోట్లు విలువైన స్థలం ఎలా చేజారిందన్నది భీమిలి ఆర్డీవో కార్యాలయం, మండల తహసీల్దార్ కార్యాలయంలో అంతుబట్టడం లేదు. కోర్టు కేసుకు సంబంధించి పంపిన సమన్లు ఆర్డీవో, తహసీల్దార్‌ల దృష్టికి రాకుండా చేసిన వారెవరు? అనే విషయంపై ఆరా తీస్తున్నారు. కోర్టు ఎక్స్‌పార్టీ డిక్రీ మంజూరు చేయడానికి పరోక్షంగా సహకరించిన వారెవరు? అన్న విషయమై కార్యాలయాలలో విచారణ జరుగుతోంది. సాధారణంగా తపాలా బాధ్యతలు ఒకరు చూస్తుంటారు. పోస్టుమాన్‌ను రప్పించి ఆరా తీశారు. విశేషమేమంటే కార్యాలయాలకు సంబంధంలేని మహిళ కోర్టు కవర్లు అందుకున్నట్లు పోస్టుమాన్ వద్ద లభించిన ఆధారాల్లో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎవరామె? అని అధికారులు కూపీ లాగుతున్నారు. ఇది ఎవరో కావాలనే అధికారుల దృష్టికి వెళ్లకుండా చేసిన వ్యవహారంగా ఉందని భావిస్తున్నారు. ఈ వ్యవహారంతో రెవెన్యూ పాలనలో డొల్లతనం బయటపడింది. భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్‌తో మాట్లాడగా ఎక్కడ లోపం జరిగిందో విచారణ చేస్తున్నామని, కోర్టు ఏజీపీతోనూ సంప్రదిస్తామని అన్నారు. ప్రభుత్వ స్థలాన్ని న్యాయ నియమాల ప్రకారం తిరిగి పొందేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ పి.రామారావుతో మాట్లాడగా విచారణ చేస్తున్నామన్నారు. భీమిలి సబ్ పోస్టుమాస్టర్ బి.చంద్రశేఖర్‌తో మాట్లాడగా వివరాలు మూడు నెలల వరకూ తమ వద్ద ఉంటాయన్నారు. మాన్యువల్ రికార్డులో భద్రంగా ఉంటాయన్నారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు విధివిధానాలపై కమిటీ

... 5వ పేజీ తరువాయి

యాజమాన్య ప్రతినిధులు పేర్కొన్నారు. ఇటీవల తొలగించిన 248 మంది కాంట్రాక్టు కార్మికుల బయోమెట్రిక్‌ను పునరుద్ధరించాలని రీజనల్ లేబర్ కమిషనర్ సూచించారు. అయితే అందుకు యాజమాన్యం ప్రతినిధులు స్పందిస్తూ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశంపై విధి విధానాలకు కమిటీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్లాంటులో ఏ ఒక్క కార్మికుడినీ తొలగించినా సహించేది లేదని, ఆందోళనను ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల నేతల హెచ్చరించారు. ఈ నేపథ్యంలో చర్చలను ఈ నెల 26కి వాయిదా వేశారు. ఈ సమావేశంలో అధికారులు జీఎం ఎం.మధుసూదనరావు, ఖర్, శంకర్, కార్మిక నాయకులు జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, మంత్రి రవి, వంశీకృష్ణ, సత్యారావు పాల్గొన్నారు. సమావేశ అనంతరం సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రీజనల్ లేబర్ కమిషనర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు.

సచివాలయాల్లో సాంకేతిక సిబ్బంది హేతుబద్ధీకరణ

... 5వ పేజీ తరువాయి

4,295...మొత్తం 4,809 మంది ప్రస్తుతం ఉన్నారు. మరో 514 ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న వారిలో రమారమి 500 మంది వివిధ కారణాలతో సెలవుల్లో ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయాలను హేతుబద్ధీకరించి అదనపు సిబ్బందిని ఇతర శాఖలకు పంపాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సచివాలయాల్లో సాంకేతిక సిబ్బందికి రెండేసి సచివాలయాలు అప్పగించే కార్యక్రమం చేపట్టింది. గ్రామ సచివాలయాల్లో సాంకేతిక సిబ్బంది జాబితాలో వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్, ఫిషరీస్, పశు సంవర్ధక శాఖ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్, ఏఎన్ఎం, నగర పరిధిలో ఇంజనీరింగ్, ప్లానింగ్ ఎఎన్ఎం, ఎమినిటీస్ సెక్రటరీలు ఉంటారు. సాంకేతిక సిబ్బందిగా పరిగణించే సెక్రటరీలు, అసిస్టెంట్లు ఇకపై దగ్గరదగ్గరగా ఉన్న రెండు సచివాలయాల్లో సేవలు అందించాల్సి ఉంటుంది. అందుకోసం ప్రస్తుతం రెండేసి సచివాలయాలను మ్యాపింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మిగిలిన సిబ్బందిని ఆయా ప్రభుత్వ శాఖలకు పంపుతారు. ఉదాహరణకు అగ్రికల్చర్ అసిస్టెంట్లు వ్యవసాయ శాఖకు, ఉద్యానవన అసిస్టెంట్లు సంబంధిత శాఖకు, ఏఎన్ఎంలు ఆరోగ్య శాఖకు వెళతారు. ఈ ప్రక్రియ ఈనెల 15వ తేదీలోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఫీజు బకాయిల పాపం ఎవరిది?

... 5వ పేజీ తరువాయి

మరో పది కోట్ల రూపాయలకుపైగానే వసతి దీవెన బకాయిలు ఉన్నాయి. ఈ బకాయిల వ్యవహారంకూటమి ప్రభుత్వ పెద్దలు దృష్టికి వెళ్లడంతో విడతల వారీగా విడుదల చేస్తామన్న హామీ ఇచ్చారు.

జనవరిలో ఫీజులు విడుదల

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కూటమి ప్రభుత్వం జనవరిలో భారీగా నిధులు విడుదల చేసింది. జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో వివిధ కోర్సులు చదువుతున్న 4,500 మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించిన 3,929 మంది విద్యార్థులకు సుమారు రూ.5.5 కోట్లు విడుదల చేసింది. అలాగే, బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని బీసీ, ఈబీసీ, కాపు విద్యార్థులు 39,781 మంది విద్యార్థులకు రూ.191.42 కోట్లు ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మొత్తాలను చెల్లించింది. గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా విద్యార్థులు, తల్లి అకౌంట్‌కు కాకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కాలేజీ యాజమాన్యాలకు చెల్లించింది. స్కాలర్‌షిప్‌లను మాత్రం విద్యార్థుల అకౌంట్లకు జమ చేసింది. మిగిలిన బకాయిలను దశల వారీగా విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గడిచిన ఐదేళ్ల ఉన్నత కోర్సులు చదివిన విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ ప్రభుత్వం...ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై పోరు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

ఇదిలావుండగా ఆందోళన కార్యక్రమం నిర్వహణపై వైసీపీలో కూడా అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికారంలో ఉన్నప్పుడు సక్రమంగా ఫీజులు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందిపెట్టి...ఇప్పుడు ఆందోళన చేయడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు.

'హయగ్రీవ' రిజిస్ట్రేషన్లు బంద్

... 5వ పేజీ తరువాయి

భూమిని తీసుకున్న సంస్థ ఉద్దేశపూర్వకంగా నిబంధనలు ఉల్లంఘించడం, తప్పుడు సమాచారం ఇవ్వడం, దానిని సమర్థించుకోవడం, ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోకపోవడం, స్వార్థంగా వ్యవహరించడం వల్లనే భూమిని వెనక్కి తీసుకున్నామని కలెక్టర్ ప్రత్యేక నోటీసు ద్వారా తెలియజేశారు. దానిని ఆ ప్రాంగణంలో ఆలయం గోడకు అతికించారు. అందులోకి ఎవరూ వెళ్లకుండా కంచె వేయడంతో పాటు పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటుచేశారు.

గజం కొన్న ధర రూ.937.50... అమ్మకం ధర రూ.41,666.

హయగ్రీవ జగదీశ్వరుడు ప్రభుత్వం నుంచి ఎండాడలో ఎకరా రూ.45 లక్షల చొప్పున కొన్నారు. ఇది 2008లో జరిగింది. దీనిని పదిహేనేళ్ల తరువాత అందులో మేనేజింగ్ పార్టనర్‌గా చేరిన గద్దె బ్రహ్మాజీ గజం రూ.41,666 చొప్పున విక్రయించారు. అంటే 40 రెట్లు అధిక ధరకు అమ్ముకున్నారు. కలెక్టర్ జారీచేసిన నోటీసులో పరోక్షంగా ఈ అంశం ప్రస్తావించారు. ఓల్డ్‌ఏజ్ హోమ్‌లో 600 గజాల స్థలాన్ని ఒకరికి రూ.2.5 కోట్లకు విక్రయించారని, అందులో రూ.1.5 కోట్లు సొమ్ము తీసుకున్నారని, ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. అంటే గజం రూ.41,666 చొప్పున అమ్మినట్టు తేలింది. ఇలా వ్యాపార దృక్పథంలో వ్యవహరించినందునే భూ కేటాయింపు రద్దు చేశారు.

వృద్ధులకు ఆశ్రమం నిర్మించకుండానే విల్లాల నిర్మాణం

తీసుకున్న 12.51 ఎకరాల భూమిలో 10 శాతం భూమి ఉపయోగించి వృద్ధులు, అనాథలు, దివ్యాంగులకు ఆశ్రమం నిర్మిస్తామని, ఉచితంగా నిర్వహిస్తామని ఒప్పందం చేశారు. పదిహేనేళ్లు అయినా దానిని పూర్తి చేయలేదు. కానీ గ్రూపు డెవలప్‌మెంట్ స్కీమ్ కింద 61 మందితో చేసుకున్న ఒప్పందాల మేరకు విల్లాల నిర్మాణం మాత్రం చివరి దశకు తీసుకువచ్చారు. ఈ హామీని కూడా అమలు చేయకపోవడం వల్ల భూమిని రద్దు చేశారు.

15 మాస్టర్ ప్లాన్ రహదారులు అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

జంక్షన్ నుంచి శొంఠ్యాం మార్గంలో గండిగుండం సర్వే నంబర్ 240 వరకు ఉన్న మార్గాన్ని 60 మీటర్లకు విస్తరించనున్నారు. దీని పొడవు ఎనిమిది కిలోమీటర్లు. పినగాడి, పెదగాడి ప్రాంతాల నుంచి వేపగుంట మీదుగా ఈ జంక్షన్‌కు వచ్చేవారు విస్తరించే మార్గంలో అనకాపల్లి జాతీయ రహదారిని చేరుకొని ఆనందపురం మీదుగా భోగాపురం విమానాశ్రయానికి చేరుకోవచ్చు. విశాఖ నగరం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పించేందుకు దీనిని విస్తరిస్తున్నారు. ఈ రహదారిని ఆర్ అండ్ బి, వీఎంఆర్‌డీఏ కలిసి పర్యవేక్షిస్తాయి.

2. పెందుర్తి మండలం పినగాడి జంక్షన్ నుంచి వేపగుంట జంక్షన్ వరకూ ఉన్న రహదారిని 45 మీటర్లకు విస్తరించనున్నారు. దీని పొడవు 7.25 కి.మీ. ఇది ఆర్ అండ్ బి పరిధిలో ఉంది.

3. పెందుర్తి మండలం వేపగుంట సర్వే నంబర్ 33 నుంచి జుత్తాడ సర్వే నంబర్ 128 వరకు 24 మీటర్ల వెడల్పున గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మిస్తారు. దీని పొడవు 6.05 కి.మీ.

4. భీమిలి మండలం చిప్పాడ సర్వే నంబర్ 48 దివీస్ రహదారి నుంచి విజయనగరం జిల్లాలోని పోలిపల్లి దివీస్ రహదారి వరకూ 24 మీటర్ల వెడల్పున 6.32 కి.మీ. రహదారిని విస్తరిస్తారు. దీనికి అయ్యే వ్యయాన్ని దివీస్ భరించడానికి ముందుకు వచ్చింది.

5. ఆనందపురం మండలం గండిగుండం (జాతీయ రహదారి) సర్వే నంబర్ 211 నుంచి విజయనగరం జిల్లా కొత్తవలస సర్వే నంబర్ 34 వరకూ 24 మీటర్ల వెడల్పున రహదారిని విస్తరిస్తారు. దీని పొడవు 3.5 కి.మీ. 18 మీటర్ల వెడల్పున ఇంకో 6.4 కి.మీ. రహదారిని అభివృద్ధి చేస్తారు.

6. భీమిలి మండలం వెల్లంకి సర్వే నంబర్ 148, దొరతోట జంక్షన్ నుంచి కుమ్మరిపాలెం సర్వే నంబర్ 56 వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని 60 అడుగుల మేర అభివృద్ధి చేస్తారు. దీని పొడవు 6.2 కిలోమీటర్లు.

7. భీమిలి మండలం తగరపువలస సర్వే నంబర్ 26 నుంచి మూలకుద్దు సర్వే నంబరు 17 వరకు ప్రస్తుత రహదారిని 45 మీటర్ల వెడల్పున 3.6 కి.మీ. పొడవుతో అభివృద్ధి చేస్తారు.

8. భీమిలి మండలం నేరెళ్లవలస సర్వే నంబరు 8 నుంచి దొరతోట మీదుగా తాళ్లవలస సర్వే నంబరు 161 వరకూ 24 మీటర్ల వెడల్పున గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నాలుగు కి.మీ. పొడవున అభివృద్ధి చేస్తారు.

9. ఆనందపురం మండలం గంభీరం సర్వే నంబర్ 125 నుంచి అదే గ్రామంలో సర్వే నంబరు 9 మీదుగా జాతీయ రహదారి వరకు 18 మీటర్ల వెడల్పున 2.5 కి.మీ. పొడవుతో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వేస్తారు.

10. భీమిలి మండలం బోయపాలెం జంక్షన్ నుంచి పరదేశిపాలెం సర్వే నంబర్ 11, కాపులుప్పాడ సర్వే నంబర్ 302 మీదుగా మంగమారిపేట జంక్షన్ వరకు గల మూడు కిలోమీటర్ల మార్గంలో కొంత 30 మీటర్లు, మరికొంత 18 మీటర్ల వెడల్పున అభివృద్ధి చేస్తారు.

11. విశాఖపట్నం గ్రామీణ మండలం పరదేశిపాలెం సర్వే నంబర్ 173 నుంచి భీమిలి మండలం కాపులుప్పాడ సర్వే నంబర్ 329లో తిమ్మాపురం జంక్షన్ వరకూ 30 మీటర్ల వెడల్పున 6.3 కి.మీ. రహదారిని ఇటీవలె పూర్తిచేశారు.

12. విశాఖ గ్రామీణ మండలం శివశక్తినగర్‌లో 18 మీటర్ల రహదారిని, మారికవలసలో వీఎంఆర్‌డీఏ హరిత ప్రాజెక్టు వరకు ప్రస్తుత రహదారిని 12, 18, 24 మీటర్ల వెడల్పున అభివృద్ధి చేస్తారు. దీని పొడవు 1.7 కి.మీ.

13. విజయనగరం జిల్లా ఐనాడ జంక్షన్ సర్వే నంబరు 8 నుంచి విజయనగరం రింగ్ రోడ్డు ఐస్ ఫ్యాక్టరీ వరకు ప్రస్తుత రహదారిని 24 మీటర్ల వెడల్పుతో 6.5 కి.మీ. అభివృద్ధి చేస్తారు.

14. దాకమర్రి సర్వే నంబరు 270 నుంచి మోపాడ మీదుగా భోగాపురం మండలం సవరవిల్లి సర్వే నంబరు 133 వరకు 30 మీటర్ల వెడల్పున గ్రీన్‌ఫీల్డ్ రహదారిని 6.3 కి.మీ. పొడవున అభివృద్ధి చేస్తారు.

15. ఆనందపురం మండలం గండిగుండం నుంచి విజయనగరం జిల్లా కొత్తవల సర్వే నంబరు 34, చింతలపాలెం రాష్ట్ర జాతీయ రహదారి 135 అరకు రోడ్డు వరకు ప్రస్తుత రహదారి కొంత, మరికొంత గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు 24, 18 మీటర్ల వెడల్పున 9.9 కి.మీ. పొడవుతో అభివృద్ధి చేస్తారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హార్బర్ సబ్ డివిజన్ ఏసీపీ కాళిదాస్

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

ఏసీపీ కాళిదాస్

పెదగంట్యాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పేదలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని హార్బర్ సబ్ డివిజన్ ఏసీపీ కాళిదాసు హెచ్చరించారు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ స్టేషన్ పరిధిలో తమ సిబ్బంది ఇటీవల దాడులు చేసి రూ.2,09,912 విలువైన 5,524 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారన్నారు. బియ్యం తరలిస్తున్న గెంబలి ప్రసాద్, పెద్దిన కొండలరావు, అంకాల నారాయణలపై కేసు నమోదు చేయడంతో పాటు బియ్యం తరలింపునకు వినియోగించిన రెండు వ్యాన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమం తరలించే వ్యక్తులపై నిఘా పెంచుతామని, పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో సీఐ టి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు 86, 87 వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి సిద్ధార్థనగర్‌లో గల 12 ఎంఎల్‌డీ తాగునీటి శుద్ధి కర్మాగారంలో వాల్వ్‌ల మార్పు, మరమ్మతు పనులు చేపట్టనున్నందున బుధవారం 86, 87 వార్డులకు నీటి సరఫరా జరగదని నీటి సరఫరా విభాగం ఏఈ కేదారినాథ్ తెలిపారు. నీటి సరఫరాను మరింత మెరుగ్గా అందించేందుకుగాను నిర్వహణ పనులు చేపడుతున్నామని, ఈ విషయాన్ని ప్రజలందరూ గ్రహించాలని ఆయన కోరారు.

వీధి లైట్ల ఏర్పాటు

అగనంపూడి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. వార్డు పరిధిలోని దేశపాత్రునిపాలెం, సాయినగర్ కాలనీ, రామాలయం వద్ద, జాజులవానిపాలెం కల్యాణ మండం, ప్రధాన రహదారిలో మంగళవారం ఆయన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వార్డులోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మచ్చా శివ, ఎస్.ప్రకాశ్, చిన్నారావు, బాబూరావు, కె.అప్పారావు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 27, టమాటా 14, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 42, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 36 దొండకాయలు 38, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)6, అల్లం (పాతది)50, బరబాటి 36, ముల్లంగి 26, మునక్కాడలు (కిలో) 60, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, క్యాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34 చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 58, గోరుచిక్కుడు 34, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండటిసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170

విరిగిపడిన విద్యుత్ స్తంభం

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



విరిగిపడిన స్తంభం



అపస్మారక స్థితిలో ఉన్న కామేశ్వరరావు, గాయపడిన సత్యవతి

అక్కిరెడ్డిపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మంగళవారం ఊహించని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ స్తంభం విరిగిపడడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాజువాక పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన బి.కామేశ్వరరావు (37) ఏదైనా ఉపాధి దొరుకుతుందేమోనన్న ఆశతో మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై విశాఖ డెయిరీకి బయలుదేరాడు.

భెల్ హెచ్‌పీవీపీ వద్దకు చేరుకున్నాడు. డివైడర్ పక్కన వాహనం నిలిపాడు. అప్పటికే అక్కడ నాతయ్యపాలేనికి చెందిన డి.సత్యవతి (55) అనే మహిళ కూడా డెయిరీ వద్దకు వెళ్లేందుకు వేచి ఉంది. అదే సమయంలో గాజువాక నుంచి నగరంలోకి వెళుతున్న ఓ ఆర్టీసీ బస్సుకు తుప్పుపట్టిన ఇనుప విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్లు తగిలాయి. దీంతో ఒక్కసారిగా స్తంభం కూలి కామేశ్వరరావు, సత్యవతిలపై పడింది. కామేశ్వరరావు తలకు తీవ్ర గాయాలవ్వడంతో అపస్మారక స్థితికి చేరుకోగా, సత్యవతి తలకు, చేతికి గాయాలయ్యాయి. కామేశ్వరరావును కేజీహెచ్‌కు, సత్యవతిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కామేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు చెబుతున్నారు. ఈ మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా స్థలాన్ని మాకు ఇప్పించండి



సుజాతనగర్‌లోని వివాదాస్పద స్థలం (ఫైల్ ఫొటో)

- కబ్జా చేసి తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారు..
- పెందుర్తి పోలీసులకు బాధితుల ఫిర్యాదు

పెందుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తాము కొనుగోలు చేసిన స్థలాన్ని కబ్జా చేసి, తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించి షెడ్డు, ప్రహరీ నిర్మాణం చేపట్టారంటూ బాధితులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. షెడ్డు, ప్రహరీని తొలిగించే యత్నం చేశామని తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేసి స్థలాన్ని వివాదాస్పదం చేసేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం బాధితుడు వి.రవివర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన తాను కుటుంబ సభ్యులతో కలిసి పెందుర్తి సమీపం సుజాతనగర్‌లో సర్వే నంబర్ 184-1లో 3,160 చదరపు గజాల స్థలానికి గల లింక్ డాక్యుమెంట్లను పరిశీలించి 2015లో ఓ న్యాయవాది వద్ద కొనుగోలు చేశామన్నారు 2016లో ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేశామన్నారు. పదేళ్ల నుంచి ఖాళీగా ఉన్న తమ స్థలాన్ని కొంతమంది అక్రమార్కులు కాజేయాలనే దురుద్దేశంతో ఈ స్థలాన్ని ఆనుకుని ఉన్న టీచర్స్ లేఅవుట్ ఉండడంతో ఆ సొసైటీకి చెందిన ఓ ప్రతినిధితో కుమ్మక్కై కుట్రకు తెర తీశారన్నారు. ఇక్కడి స్థలం టీచర్స్ లేఅవుట్‌లోనిదేనని చూపుతూ తప్పుడు పత్రాలతో సింగిల్ బిట్‌గా ఉన్న తమ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి సొసైటీకి చెందనవని పేర్కొంటూ ఏడుగురి పేర్లతో గత ఏడాది పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేశారని తెలిపారు. రిజిస్ట్రేషన్ జరిపిన ప్లాట్ల నంబర్లు, టీచర్స్ సొసైటీ లేఅవుట్‌లోని మ్యాపులో గల ప్లాట్ల నంబర్లు ఒకటే కావడంతో వీటికి 2008లోనే ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్లు జరిగినట్టు రిజిస్ట్రేషన్ కార్యాలయ ఈసీ ద్వారా తెలుసుకున్నామన్నారు. ఒకే నంబర్లు గల ఈ ప్లాట్లకు డబుల్ రిజిస్ట్రేషన్లు ఏ విధంగా జరిగాయో విచారణ జరపాలంటూ అన్ని ఆధారాలను పోలీసులకు సమర్పించామన్నారు.

తమకు చెందిన స్థలంలో షెడ్డు నిర్మించారన్న సమాచారంలో ఈ నెల 8న సుజాతనగర్ వచ్చి పరిశీలించగా.. స్థలమంతా చదును చేసి ఉందన్నారు. కరోనాతో హక్కుదారులు మృతి చెందారని ప్రచారం చేశారని స్థానికులు చెప్పడంతో ఖంగుతిన్నామన్నారు. గతంలో తాము నిర్మించిన ప్రహరీ ఒకపక్క మాత్రమే మిగిలి ఉందన్నారు. దీనిపై అదేరోజున పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ ఆక్రమణలో విజయనగరం జిల్లాలోని నీటి పారుదల విభాగంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి ప్రమేయం, కింది స్థాయి పోలీస్ అధికారి పాత్ర ఉందని రవివర్మ ఆరోపించారు. తమ స్థలాన్ని తప్పుడు పత్రాలతో ఆక్రమించి, రిజిస్ట్రేషన్లు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. నగర పోలీస్ కమిషనర్‌కు కూడా ఈ ఘటన గురించి వివరించామన్నారు. దీనిపై సీఐ కేవీ సతీశ్‌కుమార్‌ను వివరణ కోరగా సుజాతనగర్‌లోని స్థల వివాదానికి సంబంధించి పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో సర్వే నంబర్‌పై స్పష్టత ఇవ్వాలని తహశీల్దార్ కార్యాలయానికి లేఖ రాశామన్నారు. అలాగే భూ వివాదంపై పీసీఎల్ఎఫ్ ద్వారా ముందస్తుగా సీపీకి వివరించామన్నారు. వాస్తవాలు నిర్ధారణ అయ్యాకచట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

పలు ప్రాంతాల్లో పండగల కోలాహలం

కూర్మన్నపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో అమ్మవార్ల జాతరలను, ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 71వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్, పరిసర ప్రాంతాల ప్రజల దేవత శ్రీపైడితల్లమ్మ ఉత్సవాలు మంగళవారం దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువ జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించేందుకు బారులుతీరారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి పప్పు శంకరరావు, నాయకులు పప్పు రాజారావు, ప్రతాపరావు శ్రీనివాసరావులు పైడితల్లమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో, పండ్ల రసాలతో అభిషేకాలు జరిపారు. ఘటాలను పురవీధుల్లో ఊరేగించాక ఆలయానికి తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపును పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ చేపట్టారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, కార్పొరేటర్ రాజాన రామారావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల దేవన్‌రెడ్డి, శివ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పూజలందుకున్న పైడితల్లమ్మ, పక్కన ఊరేగింపుగా పుట్టబంగారం తెస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

లేమర్తిలో ముగిసిన చింతాలమ్మ జాతర



పూజలందుకున్న చింతాలమ్మ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి గ్రామస్థుల ఆరాధ్య దేవత చింతాలమ్మ జాతర మంగళవారంతో వైభవంగా ముగిసింది. అనుపోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం ఆరు గంటల నుంచే అమ్మవారిని దర్శించేందుకు భక్తులు ఆలయం వద్ద బారులుతీరి ముడుపులు, మొక్కులు చెలించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించాక ఆలయం వద్దకు తీసుకువచ్చి పూజలు జరిపారు. ఈ సందర్భంగా చేపట్టిన బాణసంచా కాల్పులతో పాటు రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పైడిమాంబ అనుపోత్సవం

ఏదూరివానిపాలెంలో పైడిమాంబ పండగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి అనుపోత్సవాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు పైడిమాంబను దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించాక ఆలయం వద్ద అనుపోత్సవం జరిపారు.

18న పెదమడక పైడిమాంబ పండగ

జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడిమాంబ జాతరను ఈ నెల 18న ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, విందుల నారాయణరావు, మజ్జి శ్రీను, జి.అప్పారావు, కె.సన్నీ, వి.సతీశ్, ఎ.వరహాలు, కె.నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి శాంతిధామం వార్షికోత్సవాలు

పెదగంట్యాడ: ఇక్కడి సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతి ధామం వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీసాయినాథ్ సేవక్ కమిటీ ఈ ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి కాగడా హారతి ఇచ్చాక గణపతి పూజ, పుణ్యాహచనం, రుత్విక్‌వరుణ, గ్రహ, వాస్తు, భైరవ, వారాహి, శరభ పూజలు, వారాహి సమేత లక్ష్మీకుబేరుల హోమాలు జరిపారు. సాయంత్రం నక్షత్ర కలశారాధన చేపట్టారు. హరిపద సంకీర్తన బృందం వారి కోలాటాలు ఆకట్టుకున్నాయి. కమిటీ ప్రతినిధులు కొల్లి సత్యంబాబు, రవిశేఖర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో షిర్డీ సాయినాథుడు

సీతారామ కోదండ రామాలయంలో పూజలు

పెందుర్తి: మండలంలోని వాలిమెరక జుత్తాడ పంచాయతీ పరిధి దువ్వపాలెంలో సీతా సమేత కోదండ రామలయంలో నూతనంగా విగ్రహాలను ప్రతిష్ఠించిన నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు, గర్భాలయంలోని సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి, వినాయక, సరస్వతి విగ్రహాలకు పంచామృతాభిషేకాలు చేశారు. సర్పంచ్ బొడ్డు వాణీ ప్రకాశ్ ఆధ్వర్యంలో రుత్వికులు పూజలను శాస్త్రోక్తంగా జరిపారు.

సింహగిరికి పాదయాత్రగా ముత్యాలమ్మ భక్తులు



మాలధారణ చేసిన ముత్యాలమ్మ భక్తులు

వేపగుంట: వేపగుంట పరిసర ప్రాంతాల ప్రజల ఇలవేల్పు శ్రీముత్యాలమ్మ మాలధారణ చేసిన భక్తులు తిరువీధి ఉత్సవాల్లో భాగంగా పాదయాత్రగా సింహగిరికి చేరుకుని అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. అమ్మవారి నామస్మరణ చేస్తూ.. సింహాద్రి అప్పన్న కీర్తనలను, భక్తి గీతాలను ఆలపిస్తూ వారు మెట్ల మార్గం గుండా సింహగిరికి చేరుకున్నారు.

వైసీపీ నాయకుడిపై కేసు నమోదు

గాజువాక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రాంతానికి చెందిన ఓ వైసీపీ నాయకుడుతో పాటు ఆయన అనుచరులపై గాజువాక పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ వాంబే కాలనీలో నివాసముంటున్న దార రమణమ్మ అనే మహిళ ఇంటికి గతనెల 28న వైసీపీ నాయకుడు దొడ్డి రమణ, ఆయన అనుచరులు మంత్రి మంజుల, మంత్రి వెంకటసత్యనారాయణ, మంత్రి వెంకటేశ్, తదితరులు వెళ్లి వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని నీ కొడుకు దొంగిలించాడంటూ రమణమ్మను కులం పేరుతో దూషించడమే కాకుండా దుర్భాలాషలాడి చంపుతానని బెదిరించారన్నారు. మతిస్థితిమితం లేని తమ కుమార్తెను చేతులతో తోసేశారంటూ రమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూ పార్కులో రెండో సింహం పిల్ల మృతి?

ఆరిలోవ, మార్చి11 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో సుమారు 15 రోజుల క్రితం సింహం రెండు పిల్లలకు జన్మనిచ్చింది. పుట్టిన పది రోజులకే ఒకటి మృతి చెందినా జూ అధికారులు బయటపెట్టలేదు. తాజాగా ఇప్పుడు మరో సింహం పిల్ల కూడా మృతి చెందినట్టు తెలిసింది. ఈ విషయాన్ని జూ క్యూరేటర్ మంగమ్మ వద్ద ప్రస్తావించగా.. మమ్మల్ని రచ్చ చేయవద్దంటూ మండిపడ్డారే తప్పా రెండో సింహం పిల్ల మృతి చెందిన విషయాన్ని మాత్రం దాటవేశారు. సాధారణంగా కళ్లు తెరవని జంతువుల పిల్లలకు జన్యుపరంగా పలు వ్యాధులు వస్తాయి కాబట్టి వాటి సంరక్షణకు అనేక జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. గతంలో ఒక సింహం పిల్ల మృతి చెందినట్టు పత్రికల్లో రాశారు కానీ తాము నిర్ధారించలేదని పేర్కొన్నారు.

డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాల తొలగింపు



వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

ఆటోనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో పలు బ్లాక్‌లలోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను మంగళవారం తొలగించారు. డ్రైనేజీల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు తిష్ఠ వేయడంతో పలు పరిశ్రమల యజమానులు, కార్మికులు తీవ్ర దుర్వాసనతో పాటు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు ఐలా కమిషనర్ ఎ.కిశోర్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన ఆయన డ్రైనేజీల్లోని పూడికలను తొలగించేందుకు సిబ్బందిని చేశారు.

రోడ్లు, కాలువల నిర్మాణ పనుల పర్యవేక్షణ

ఎన్.ఎ.డి.జంక్షన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 90వ వార్డు పరిధి లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌లో రూ.47 లక్షలతో చేపట్టిన రహదారులు, కాలువల నిర్మాణ పనులను మంగళవారం అధికారులు పర్యవేక్షించారు. కొండవాలు ప్రాంతాల్లో తరచూ రోడ్లు, కాలువలు మరమ్మతులకు గురవుతున్నందున నాణ్యతా ప్రమాణాలను పాటించి పక్కాగా నిర్మాణాలు సాగేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి, వర్క్స్ సూపర్‌వైజర్ రామకృష్ణ, స్థానిక నాయకులు మాణిక్యం, పట్నాయిక్, వెంకటలక్ష్మి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



సింటర్ ప్లాంట్ విభాగాధిపతి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కాంట్రాక్టు కార్మికుల తొలగింపును ఆపాలి

స్టీల్‌ప్లాంటులోని పలు విభాగాల్లో నిరసన

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియను ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపు, పోరాటాలు చేసిన నాయకులకు ఇచ్చిన షోకాజు నోటీసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆయా విభాగాల్లో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తున్న కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు ఉక్కు యాజమాన్యం పాల్పడుతుందన్నారు. సమస్యలపై పోరాటాలు చేస్తున్న కార్మిక వర్గాన్ని అణచివేసేందుకు యాజమాన్యం కుట్ర చేస్తుందని మండిపడ్డారు. సంస్థ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మిక వర్గంపై దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, పీవీ రమణమూర్తి, జె.అయోధ్యరామ్, పి.శ్రీనివాసరాజు, వైటీ దాసు, రామస్వామి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల రీడింగ్ సిబ్బంది ఆందోళన



ఆందోళన చేస్తున సిబ్బంది

మల్కాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మల్కాపురం సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ మీటర్ల రీడింగ్ సిబ్బంది మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం వల్ల తామంతా ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల విద్యుత్ శాఖలో తమకు ఉపాధి కల్పించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. తమ ఆందోళనలో భాగంగా ఈ నెల 15న రాష్ట్ర కమిటీ సమావేశం, 18న విద్యుత్ డివిజన్ కార్యాలయాల వద్ద నిరసన, 20న సూపరింటెండెంట్ కార్యాలయాల వద్ద ఆందోళన, 24న కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత, 27న సీఎండీ కార్యాలయలం వద్ద నిరసన తెలపడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి తమకు న్యాయం చేయాలని కోరారు.

డంపింగ్ యార్డును తరలించాలని విజ్ఞప్తి



పట్టాభిరామ్‌తో మాట్లాడుతున్న గంధం శ్రీనివాసరావు

పెదగంట్యాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి పోర్టు రోడ్డు శివారున ఉన్న డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించేందుకు చర్యలు చేపట్టాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్‌ను డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు కోరారు. జీవీఎంసీ కార్పొరేషన్ కార్యాలయానికి విచ్చేసిన పట్టాభిరామ్‌ను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి డంపింగ్ యార్డు సమస్యను వివరించారు. వార్డులో డంపింగ్ యార్డు ఉండడం వల్ల ఇక్కడి పది కాలనీలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డంపింగ్ యార్డు నుంచి వస్తున్న దుర్వాసన, దుమ్ము, ధూళి వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని పట్టాభిరామ్‌కు వివరించారు. అందుకు స్పందించిన పట్టాభిరామ్ త్వరలోనే డంపింగ్ యార్డును సందర్శించి, సమస్యను పరిష్కరిస్తామని మాటిచ్చారని గంధం శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలి

పెందుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలని మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ అన్నారు. పినగాడిలో ఉన్న విస్టం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ వీక్ క్రీడోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ మళ్ల అనూష, ఫిజికల్ డైరెక్టర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

డాక్‌యార్డులో ఘనంగా మహిళా దినోత్సవం

మల్కాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు సహనశీలులు, కార్యశీలులు మాత్రమే కాదని శక్తి స్వరూపాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధ సంస్థ భారతీయ ప్రతిరక్ష మజ్దూర్ సంఘ్ ఫెడరేషన్ ఉప ప్రధాన కార్యదర్శి పుట్టా విద్యాసాగర్ అన్నారు. మంగళవారం నేవల్ డాక్‌యార్డులో ఇండియన్ నేవీ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పారిశ్రామిక రక్షణ సాంకేతిక రంగంలో నారీశక్తిని పెంచడం వల్ల ఉత్పత్తి రంగంలో మరింత పురోభివృద్ధి సాధించవచ్చన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేశ్ మాట్లాడుతూ తూర్పు నౌకాదళ పరిధిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు యూనియన్ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పైలా దేముడునాయుడు, పి.సురేశ్, రెడ్డిపల్లి యోగిత, జగదీశ్, బి.శివకాసుబాబు, లక్ష్మణ్, చింతాడ రమణ, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత ధరలకే కూరగాయలను అమ్మాలి

ఎన్.ఎ.డి.జంక్షన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం రైతుబజారులో మంగళవారం రైతులకు, వ్యాపారులకు ఎస్టేట్ అధికారి నారాయణరావు అవగాహన కల్పించారు. వేసవిలో కూరగాయల శాతం తగ్గకుండా చూడాలని, ఉదయం పది గంటల తరువాత మాత్రమే అధిక మొత్తంలో కూరగాయలను టోకు వర్తకులకు విక్రయించాలని, పట్టికలో పేర్కొన్న ధరకే కాయగూరలను అమ్మాలని, ప్రతీ స్టాల్ వద్ద డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసి రైతుబజారును పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సహాయకుడు ప్రతాప్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కేవీలో అడ్మిషన్లను ప్రారంభించాలి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతి అడ్మిషన్లను ప్రారంభించాలని కోరుతూ డీజీఎం (హెచ్ఆర్) జి.గాంధీకి 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారాం, సీఐటీయూ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అన్ని కేంద్రీయ విద్యాలయాల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, స్టీల్‌ప్లాంటులో మాత్రం ఇంకా ప్రారంభం కాలేదన్నారు. దీనిపై ఉక్కు యాజమాన్యం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఒకటి, ప్లస్1 తరగతుల్లో ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉక్కు డైరెక్టర్‌ను కలిసిన కార్మిక నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ (కమర్షియల్)గా బాధ్యతలు స్వీకరించిన సలీమ్ జి పురుషోత్తమన్‌ను మంగళవారం కార్మిక సంఘ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ప్లాంటును ప్రగతిపథంలో నడిపించాలని, కార్మిక సంఘాల తరఫున తాము సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు. అందరి సహకారంతో అధిక ఉత్పత్తితో స్టీల్‌ప్లాంట్‌ను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళతామని డైరెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, డొమ్మేటి అప్పారావు, మోహన్‌బాబు, తదితరులు ఉన్నారు.

నేడు వైసీపీ 'యువత పోరు'

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు బకాయిలు, నిరుద్యోగులకు భృతి విడుదల, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలనే డిమాండ్లతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బుధవారం 'యువత పోరు' పేరుతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించబోతోంది. జిల్లా పరిషత్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర పార్టీ సమన్వయకర్త కురసాల కన్నబాబు, జిల్లాలోని వైసీపీ నేతలు, కార్యకర్తలు హాజరవుతారు.

'దూరంగా ఉంటాం'

అక్కయ్యపాలెం: వైసీపీ పోరుబాటకు తాము దూరంగా ఉంటామని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత కుమార్ తెలిపారు. ఎన్‌జీజీఓస్ కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

నేత్ర వైద్యశాలలో గ్లకోమా వైద్య పరీక్షలు



కంటిని పరీక్షిస్తున్న వైద్యురాలు

సీతంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాఖ సంయుక్తంగా కంటి ఆసుపత్రిలో నిర్వహిస్తున్న గ్లకోమా పరీక్షలకు స్పందన కనిపిస్తోంది. ఆదివారం లాంఛనంగా ప్రారంభించిన ఈ పరీక్షలు సోమ, మంగళవారాల్లోనూ కొనసాగాయి. గ్లకోమా అనుమానితులను నేత్ర వైద్యురాలు డాక్టర్ సౌజన్య పరీక్షించి వైద్య సలహాలిచ్చారు. గ్లకోమా వ్యాధిపై అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలకు రావాలనుకునేవారు ఆధార్ కార్డును తీసుకొస్తే ఓపీ టికెట్ సులభమవుతుందని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి తెలిపారు. ఆప్తాల్మిక్ అధికారులు ఉమా శ్రీనివాస్, సురేష్, హెల్త్ విజిటర్ విజయలక్ష్మి, జూనియర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచితంగా పరీక్షా పరికరాల పంపిణీ

డాబాగార్డెన్స్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పిల్లలకు ఉచితంగా పరీక్షా పరికరాలను పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. మంగళవారం సాయంత్రం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విశ్వ చిత్రకళ, విప్పర్తి రామం కామేశ్వరి సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్షా పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు, శ్రీనివాసరావు, బుచ్చిరాజు, జగన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కంచరపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేస్తే ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్టేనని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు అన్నారు. కళాశాల్లో మంగళవారం ఎ.ఎస్.రాజు బ్లడ్‌బ్యాంకు సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండి 18 ఏళ్లు నిండిన ఎవరైనా రక్తదానం చేయవచ్చునన్నారు. విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ విభాగాధిపతి గోవర్దన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ఆందోళన



యాక్సెస్ బ్యాంకు వద్ద నినదిస్తున్న ఉద్యోగులు

సీతంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ద్వారకానగర్‌లోని యాక్సెస్ బ్యాంక్ వద్ద మంగళవారం ఉద్యోగులు, అధికారులు నినదించారు. యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఆర్.వసంతరావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

తల్లిదండ్రులకు కుమార్తె అప్పగింత

అక్కయ్యపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న తమిళనాడుకు చెందిన వర్షిణి (18)ని తల్లిదండ్రులు లక్ష్మి, వేంకటేశ్‌లకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడొద్దంటూ తల్లి మందలించడంతో వర్షిణి ఇంట్లో చెప్పకుండా రైలులో వైజాగ్ వచ్చేసిందని చెప్పారు. బీబీఏ చదువుతున్న ఆమెను రైల్వేస్టేషన్‌లో గుర్తించి మహిళా నిరాశ్రయుల వసతిగృహానికి తరలించి ఆశ్రయం కల్పించినట్లు తెలిపారు. తల్లిదండ్రులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి వర్షిణిని తీసుకెళ్లారని పేర్కొన్నారు.

కన్నుల పండువగా పైడిమాంబ జాతర



ఆర్పీపేటలో మంగళవారం రాత్రి అమ్మవారి ఘటాలకు ప్రణమిల్లుతున్న భక్తులు



ఊరేగింపు ముందు అలరించిన వేషధారణలు

కంచరపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్పీపేట గ్రామ ఆరాధ్యదేవత పైడిమాంబ అమ్మవారి ప్రధాన పండగను గ్రామస్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆర్పీపేట రైల్వే గేటు సమీపంలోని పుట్టబంగారం ఆలయం వద్ద అమ్మవారికి భక్తులు, మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించుకున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి హాజరైన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజీ ప్రోగ్రాములు ఏర్పాటు చేశారు.

ఘనంగా ముత్యాలమ్మ అనుపోత్సవం

సీతమ్మధార, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలోని గ్రామ దేవత ఏడు గుడుల ముత్యాలమ్మవారి పండుగ అనుపు మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఆలయానికి విచ్చేసిన భక్తులు అమ్మవార్లకు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని పూలు, విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. పలు వీధుల్లో విద్యుత్ దీప తోరణాలను ఏర్పాటు చేశారు. పులి వేషాలు, పంజాబీ డ్యాన్స్, కోలాటం, తప్పెటగుళ్లు, విచిత్ర వేషధారణలతో అమ్మవారి అనుపోత్సవం ఘనంగా జరిగింది. గ్రామంలో రామాలయం సమీపంలోని పెద్దింటి వద్ద నుంచి అమ్మవారి ఘటాలను, ప్రతిమలను భక్తులు తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఏడు గుడులు వద్దకు తీసుకువెళ్లి పూజలు చేశారు. బాణసంచా కాల్పులతో హోరెత్తించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ, ఇతర ఏర్పాట్లు చేశారు.



నక్కవానిపాలెంలో పెద్దింటి ఉయ్యాల వద్ద ముత్యాలమ్మ అమ్మవారి ప్రతిమలు

'అక్షయపాత్ర నిర్వహణ తీరు హర్షణీయం'



సెంట్రలైజ్డ్ కిచెన్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు దేవి తదితరులు

కంచరపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐ జంక్షన్ వద్ద గల అక్షయపాత్ర ఫౌండేషన్ సెంట్రలైజ్డ్ కిచెన్ షెడ్‌ను రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా సభ్యురాలు గంజిమాల దేవి స్టోర్‌రూంలోని సరుకులను పరిశీలించారు. కూరగాయలు శుభ్రం చేసేవిధానం, అధునాతన పరికరాలతో వంటచేసే పద్ధతిని పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. సంస్థ ప్రతినిధులు మెనూను వివరించి భోజనం తయారీ విధానాన్ని తెలియజేశారు. అనంతరం జీవీఎంసీ కప్పరాడ పాఠశాలలను పర్యటించి విద్యార్థులు భోజనం స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో డి.దివాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మంజుల తదితరులు

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రాంగణ నియామక ఉద్యోగ మేళా జరిగింది. జవహర్ నాలెడ్జ్ సెంటర్, శ్రీచైతన్య విద్యాసంస్థల సహకారంతో జరిగిన ఈ మేళాలో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్) నుంచి 13 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల వారికి నియామక పత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ వర్తమాన అంశాలు, భావవ్యక్తీకరణపై పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు పొందుతారని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, జెకెసి కో-ఆర్డినేటర్ ఎం.విద్యాకల్పన, మెంటర్లు ప్రజ్ఞ, వి.ఎస్.రాజు, శ్రీచైతన్య విద్యాసంస్థల కోఆర్డినేటర్ రామారావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

వన్‌టౌన్ సీఐ దేముడుబాబు హెచ్చరిక



కేజీహెచ్‌లో పహరా కాస్తున్న వన్‌టౌన్ పోలీసులు

మహారాణిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ పరిసరాలలో రోగులు, వారి సహాయకులకు ఇబ్బంది కలిగించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో పోలీసులు కేజీహెచ్ లోపల, చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిశీలించారు. ఆసుపత్రిలో భద్రత చర్యలు చేపట్టారు. ఆసుపత్రి పరిసరాల్లో అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. కేజీహెచ్‌లో 24 గంటలూ పెట్రోలింగ్ నిర్వహిస్తూ, గస్తీ విధులను మరింత కట్టుదిట్టం చేస్తామని వెల్లడించారు. ఆసుపత్రిలో రోగులు, వైద్యులు, వైద్య సిబ్బంది భద్రతకు ఆసుపత్రి అత్యవసర విభాగం, ప్రధాన ప్రాంగణాలలో ప్రత్యేక పోలీసు పహరా కొనసాగిస్తామన్నారు. బయట వ్యక్తులు కేజీహెచ్‌లో తిరగవద్దని హెచ్చరించారు. భద్రత కోసం ఏ సమయంలోనైనా పోలీసులను ఆశ్రయించవచ్చని, 9440796019 నెంబరుకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని దేముడుబాబు సూచించారు.

పార్కుల చుట్టూ చెత్తకుప్పలు



మాధవధార పార్కు ప్రహరీ వద్ద పేరుకుపోయిన చెత్తకుప్ప

మాధవధార, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దిన కాలనీ పార్కుల చుట్టూ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మురళీనగర్ వాకర్స్ క్లబ్, మాధవధార సెంట్రల్ పార్క్ వద్ద పారిశుధ్య పరిస్థితి దయనీయంగా మారింది. మురళీనగర్ వాకర్స్‌క్లబ్ పార్కుకు చేరే వాకర్స్ నడిచే ట్రాక్ పొడుగునా చెత్త కుప్పలు రోజుల తరబడి పోగవుతుండటంతో వ్యాయామ అవసరాలకు వచ్చేవారు ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. మాధవధార ఉడాకాలనీలో పిల్లలు ఆటలాడే మైదానం వద్ద శుభ్రత లేని మరుగుదొడ్లు, పార్క్ ప్రహరీకి ఆనుకొని వేస్తున్న చెత్త గుట్టలుగా పెరిగి దుర్గంధం వెదజల్లుతోంది. నిర్వహణ కమిటీలు శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని పలుమార్లు నెలవారీ సమావేశాల్లో చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదు. కాలనీ సంఘాలు, కమిటీ పదవుల కోసం పోటీపడే సభ్యులు పార్క్ నిర్వహణ విషయంలో పట్టించుకోవడం లేదని నివాసితులు విమర్శలు గుప్పిస్తున్నారు. వార్డు సచివాలయాలు, పారిశుధ్య విభాగం సమన్వయంతో చెత్త తరలింపుపై శ్రద్ధ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకట్టుకుంటున్న స్మార్ట్ పెయింటింగ్స్



సింహంతో జింక సెల్ఫీ తీసుకుంటున్నట్లుగా మాధవధార ఉడాకాలనీ రోడ్డులో పెయింటింగ్

మురళీనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా నగరంలో తీర్చిదిద్దుతున్న పెయింటింగ్స్ ఆకట్టుకుంటున్నాయి. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో హైవే రోడ్డు ఆర్అండ్‌బీ జంక్షన్, మాధవధార ఉడాకాలనీ కరెంట్ ఆఫీసు రోడ్డు, కంచరపాలెం బర్మా క్యాంప్ ప్రాంతాల్లో తరాలుగా నాచు పట్టి శిథిలమైన ప్రహరీల్ని ముందుగా మరమ్మతులు చేపట్టి, పనులు పూర్తయ్యాక ఎప్పటిలాగా సాధారణ రంగులు పులిమేయకుండా, జీవీఎంసీ పర్యవేక్షణలో ఇంజనీరింగ్ విభాగం కొత్త కళలను వాల్ పెయింటింగ్స్ రూపంలో తీర్చిదిద్దుతోంది. కాంట్రాక్టు ప్రాతిపదికన సుందరంగా రూపుదిద్దుకుంటున్న ఈ వాల్ పెయింటింగ్స్ ప్రజానీకాన్ని ఆకట్టుకుంటున్నాయి. మాధవధార ఉడాకాలనీ కరెంటు ఆఫీసు రోడ్డులో వేసిన సింహంతో బంగారు జింక పిల్ల చెలిమి చేస్తూ స్మార్ట్ ఫోన్‌లో సెల్ఫీ ఫోటోలకు పోజిస్తున్నట్లుగా తీర్చిదిద్దిన పెయింటింగ్ చూపరులను ఆకర్షిస్తోంది. అలాగే ఇక్కడదశాబ్దాల నాటి పాత కరెంటు ఆఫీసు ఆవరణ, బిల్లుల చెల్లింపు సెంటర్ పెయింటింగ్స్‌తో కొత్తకళను సంతరించుకున్నాయి.

కంచరపాలెం బర్మాక్యాంప్ రోడ్డులో ; సుమారు 6 వార్డులకు ఉన్న అతి పెద్ద శ్మశానవాటికకు నిత్యం దహన సంస్కారాల నిమిత్తం జనం వస్తూనే ఉంటారు. రద్దీగా ఉండే ఈ శ్మశాన వాటికను ఇటీవలే నవీకరించారు. పనుల తర్వాత ఇపుడు ప్రహరీని సుందరంగా వాల్ పెయింటింగ్స్‌తో ముస్తాబు చేసేందుకు రంగులు వేయడం ఆరంభించారు.



సుందరంగా రూపుదిద్దుకున్న ఎపీఎస్‌టీఎల్ విద్యుత్ బిల్లుల కౌంటర్

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు విధివిధానాలపై కమిటీ

... 5వ పేజీ తరువాయి

యాజమాన్య ప్రతినిధులు పేర్కొన్నారు. ఇటీవల తొలగించిన 248 మంది కాంట్రాక్టు కార్మికుల బయోమెట్రిక్‌ను పునరుద్ధరించాలని రీజనల్ లేబర్ కమిషనర్ సూచించారు. అయితే అందుకు యాజమాన్యం ప్రతినిధులు స్పందిస్తూ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశంపై విధి విధానాలకు కమిటీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్లాంటులో ఏ ఒక్క కార్మికుడినీ తొలగించినా సహించేది లేదని, ఆందోళనను ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో చర్చలను ఈ నెల 26కి వాయిదా వేశారు. ఈ సమావేశంలో అధికారులు జీఎం ఎం.మధుసూదన రావు, ఖర్, శంకర్, కార్మిక నాయకులు జె.శ్రీనివాసరావు, నమ్మి రమణ, మంత్రి రవి, వంశీకృష్ణ, సత్యారావు పాల్గొన్నారు. సమావేశ అనంతరం సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రీజనల్ లేబర్ కమిషనర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఫీజు బకాయిల పాపం ఎవరిది?

... 5వ పేజీ తరువాయి

మరో పది కోట్ల రూపాయలకుపైగానే వసతి దీవెన బకాయిలు ఉన్నాయి. ఈ బకాయిల వ్యవహారం కూటమి ప్రభుత్వ పెద్దలు దృష్టికి వెళ్లడంతో విడతల వారీగా విడుదల చేస్తామన్న హామీ ఇచ్చారు.

జనవరిలో ఫీజులు విడుదల

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కూటమి ప్రభుత్వం జనవరిలో భారీగా నిధులు విడుదల చేసింది. జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో వివిధ కోర్సులు చదువుతున్న 4,500 మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించిన 3,929 మంది విద్యార్థులకు సుమారు రూ.5.5 కోట్లు విడుదల చేసింది. అలాగే, బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని బీసీ, ఈబీసీ, కాపు విద్యార్థులు 39,781 మంది విద్యార్థులకు రూ.191.42 కోట్లు ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మొత్తాలను చెల్లించింది. గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా విద్యార్థులు, తల్లి అకౌంట్‌కు కాకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కాలేజీ యాజమాన్యాలకు చెల్లించింది. స్కాలర్‌షిప్‌లను మాత్రం విద్యార్థుల అకౌంట్లకు జమ చేసింది. మిగిలిన బకాయిలను దశల వారీగా విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గడిచిన ఐదేళ్లు ఉన్నత కోర్సులు చదివిన విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ ప్రభుత్వం...ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై పోరు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇదిలావుండగా ఆందోళన కార్యక్రమం నిర్వహణపై వైసీపీలో కూడా అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికారంలో ఉన్నప్పుడు సక్రమంగా ఫీజులు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందిపెట్టి...ఇప్పుడు ఆందోళన చేయడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు.

15 మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

జంక్షన్ నుంచి శొంఠ్యాం మార్గంలో గండిగుండం సర్వే నంబర్ 240 వరకు ఉన్న మార్గాన్ని 60 మీటర్లకు విస్తరించనున్నారు. దీని పొడవు ఎనిమిది కిలోమీటర్లు. పినగాడి, పెదగాడి ప్రాంతాల నుంచి వేపగుంట మీదుగా ఈ జంక్షన్‌కు వచ్చేవారు విస్తరించే మార్గంలో అనకాపల్లి జాతీయ రహదారిని చేరుకొని ఆనందపురం మీదుగా భోగాపురం విమానాశ్రయానికి చేరుకోవచ్చు. విశాఖ నగరం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పించేందుకు దీనిని విస్తరిస్తున్నారు. ఈ రహదారిని ఆర్ అండ్ బి, వీఎంఆర్‌డీఏ కలిసి పర్యవేక్షిస్తాయి.

2. పెందుర్తి మండలం పినగాడి జంక్షన్ నుంచి వేపగుంట జంక్షన్ వరకూ ఉన్న రహదారిని 45 మీటర్లకు విస్తరించనున్నారు. పొడవు 7.25 కి.మీ. ఆర్ అండ్ బి పరిధిలో ఉంది.

3. పెందుర్తి మండలం వేపగుంట సర్వే నంబర్ 33 నుంచి జుత్తాడ సర్వే నంబర్ 128 వరకు 24 మీటర్ల వెడల్పున గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మిస్తారు. దీని పొడవు 6.05 కి.మీ.

4. భీమిలి మండలం చిప్పాడ సర్వే నంబర్ 48 దివీస్ రహదారి నుంచి విజయనగరం జిల్లాలోని పోలిపల్లి దివీస్ రహదారి వరకూ 24 మీటర్ల వెడల్పున 6.32 కి.మీ. రహదారిని విస్తరిస్తారు. దీనికి అయ్యే వ్యయాన్ని దివీస్ భరించడానికి ముందుకు వచ్చింది.

5. ఆనందపురం మండలం గండిగుండం (జాతీయ రహదారి) సర్వే నంబర్ 211 నుంచి విజయనగరం జిల్లా కొత్తవలస సర్వే నంబర్ 34 వరకూ 24 మీటర్ల వెడల్పున రహదారిని విస్తరిస్తారు. దీని పొడవు 3.5 కి.మీ. 18 మీటర్ల వెడల్పున ఇంకో 6.4 కి.మీ. రహదారిని అభివృద్ధి చేస్తారు.

6. భీమిలి మండలం వెల్లంకి సర్వే నంబర్ 148, దొరతోట జంక్షన్ నుంచి కుమ్మరిపాలెం సర్వే నంబర్ 56 వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని 60 అడుగుల మేర అభివృద్ధి చేస్తారు. దీని పొడవు 6.2 కిలోమీటర్లు.

7. భీమిలి మండలం తగరపువలస సర్వే నంబర్ 26 నుంచి మూలకుద్దు సర్వే నంబరు 17 వరకు ప్రస్తుత రహదారిని 45 మీటర్ల వెడల్పున 3.6 కి.మీ. పొడవుతో అభివృద్ధి చేస్తారు.

8. భీమిలి మండలం నేరెళ్లవలస సర్వే నంబరు 8 నుంచి దొరతోట మీదుగా తాళ్లవలస సర్వే నంబరు 161 వరకూ 24 మీటర్ల వెడల్పున గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నాలుగు కి.మీ. పొడవున అభివృద్ధి చేస్తారు.

9. ఆనందపురం మండలం గంభీరం సర్వే నంబర్ 125 నుంచి అదే గ్రామంలో సర్వే నంబరు 9 మీదుగా జాతీయ రహదారి వరకు 18 మీటర్ల వెడల్పున 2.5 కి.మీ. పొడవుతో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వేస్తారు.

10. భీమిలి మండలం బోయపాలెం జంక్షన్ నుంచి పరదేశిపాలెం సర్వే నంబర్ 11, కాపులుప్పాడ సర్వే నంబర్ 302 మీదుగా మంగమారిపేట జంక్షన్ వరకు గల మూడు కిలోమీటర్ల మార్గంలో కొంత 30 మీటర్లు, మరికొంత 18 మీటర్ల వెడల్పున అభివృద్ధి చేస్తారు.

11. విశాఖపట్నం గ్రామీణ మండలం పరదేశిపాలెం సర్వే నంబర్ 173 నుంచి భీమిలి మండలం కాపులుప్పాడ సర్వే నంబర్ 329లో తిమ్మాపురం జంక్షన్ వరకూ 30 మీటర్ల వెడల్పున 6.3 కి.మీ. రహదారి ఇటీవ పూర్తిచేశారు.

12. విశాఖ గ్రామీణ మండలం శివశక్తినగర్‌లో 18 మీటర్ల రహదారిని, మారికవలసలో వీఎంఆర్‌డీఏ హరిత ప్రాజెక్టు వరకు ప్రస్తుత రహదారిని 12, 18, 24 మీటర్ల వెడల్పున అభివృద్ధి చేస్తారు. దీని పొడవు 1.7 కి.మీ.

13. విజయనగరం జిల్లా ఐనాడ జంక్షన్ సర్వే నంబరు 8 నుంచి విజయనగరం రింగ్ రోడ్డు ఐస్ ఫ్యాక్టరీ వరకు ప్రస్తుత రహదారిని 24 మీటర్ల వెడల్పుతో 6.5 కి.మీ. అభివృద్ధి చేస్తారు.

14. దాకమర్రి సర్వే నంబరు 270 నుంచి మోపాడ మీదుగా భోగాపురం మండలం సవరవిల్లి సర్వే నంబరు 133 వరకు 30 మీటర్ల వెడల్పున గ్రీన్‌ఫీల్డ్ రహదారిని 6.3 కి.మీ. పొడవున అభివృద్ధి చేస్తారు.

15. ఆనందపురం మండలం గండిగుండం నుంచి విజయనగరం జిల్లా కొత్తవల సర్వే నంబరు 34, చింతలపాలెం రాష్ట్ర జాతీయ రహదారి 135 అరకు రోడ్డు వరకు ప్రస్తుత రహదారి కొంత, మరికొంత గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు 24, 18 మీటర్ల వెడల్పున 9.9 కి.మీ. పొడవుతో అభివృద్ధి చేస్తారు.

సచివాలయాల్లో సాంకేతిక సిబ్బంది హేతుబద్ధీకరణ

... 5వ పేజీ తరువాయి

4,295...మొత్తం 4,809 మంది ప్రస్తుతం ఉన్నారు. మరో 514 ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న వారిలో రమారమి 500 మంది వివిధ కారణాలతో సెలవుల్లో ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయాలను హేతుబద్ధీకరించి అదనపు సిబ్బందిని ఇతర శాఖలకు పంపాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సచివాలయాల్లో సాంకేతిక సిబ్బందికి రెండేసి సచివాలయాలు అప్పగించే కార్యక్రమం చేపట్టింది. గ్రామ సచివాలయాల్లో సాంకేతిక సిబ్బంది జాబితాలో వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్, ఫిషరీస్, పశు సంవర్థక శాఖ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్, ఏఎన్ఎం, నగర పరిధిలో ఇంజనీరింగ్, ప్లానింగ్ ఎఎన్ఎం, ఎమినిటీస్ సెక్రటరీలు ఉంటారు. సాంకేతిక సిబ్బందిగా పరిగణించే సెక్రటరీలు, అసిస్టెంట్లు ఇకపై దగ్గరదగ్గరగా ఉన్న రెండు సచివాలయాల్లో సేవలు అందించాల్సి ఉంటుంది. అందుకోసం ప్రస్తుతం రెండేసి సచివాలయాలను మ్యాపింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మిగిలిన సిబ్బందిని ఆయా ప్రభుత్వ శాఖలకు పంపుతారు. ఉదాహరణకు అగ్రికల్చర్ అసిస్టెంట్లు వ్యవసాయ శాఖకు, ఉద్యానవన అసిస్టెంట్లు సంబంధిత శాఖకు, ఏఎన్ఎంలు ఆరోగ్య శాఖకు వెళతారు. ఈ ప్రక్రియ ఈనెల 15వ తేదీలోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

'హయగ్రీవ' రిజిస్ట్రేషన్లు బంద్

... 5వ పేజీ తరువాయి

భూమిని తీసుకున్న సంస్థ ఉద్దేశపూర్వకంగా నిబంధనలు ఉల్లంఘించడం, తప్పుడు సమాచారం ఇవ్వడం, దానిని సమర్థించుకోవడం, ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోకపోవడం, స్వార్థంగా వ్యవహరించడం వల్లనే భూమిని వెనక్కి తీసుకున్నామని కలెక్టర్ ప్రత్యేక నోటీసు ద్వారా తెలియజేశారు. దానిని ఆ ప్రాంగణంలో ఆలయం గోడకు అతికించారు. అందులోకి ఎవరూ వెళ్లకుండా కంచె వేయడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

గజం కొన్న ధర రూ.937.50...
అమ్మకం ధర రూ.41,666.

హయగ్రీవ జగదీశ్వరుడు ప్రభుత్వం నుంచి ఎండాడలో ఎకరా రూ.45 లక్షల చొప్పున కొన్నారు. ఇది 2008లో జరిగింది. దీనిని పదిహేనేళ్ల తరువాత అందులో మేనేజింగ్ పార్టనర్‌గా చేరిన గద్దె బ్రహ్మాజీ గజం రూ.41,666 చొప్పున విక్రయించారు. అంటే 40 రెట్లు అధిక ధరకు అమ్ముకున్నారు. కలెక్టర్ జారీచేసిన నోటీసులో పరోక్షంగా ఈ అంశం ప్రస్తావించారు. ఓల్డ్‌ఏజ్ హోమ్‌లో 600 గజాల స్థలాన్ని ఒకరికి రూ.2.5 కోట్లకు విక్రయించారని, అందులో రూ.1.5 కోట్లు సొమ్ము తీసుకున్నారని, ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. అంటే గజం రూ.41,666 చొప్పున అమ్మినట్టు తేలింది. ఇలా వ్యాపార దృక్పథంలో వ్యవహరించినందునే భూ కేటాయింపు రద్దు చేశారు.

వృద్ధులకు ఆశ్రమం నిర్మించకుండానే విల్లాల నిర్మాణం

తీసుకున్న 12.51 ఎకరాల భూమిలో 10 శాతం భూమి ఉపయోగించి వృద్ధులు, అనాథలు, దివ్యాంగులకు ఆశ్రమం నిర్మిస్తామని, ఉచితంగా నిర్వహిస్తామని ఒప్పందం చేశారు. పదిహేనేళ్లు అయినా దానిని పూర్తి చేయలేదు. కానీ గ్రూపు డెవలప్‌మెంట్ స్కీమ్ కింద 61 మందితో చేసుకున్న ఒప్పందాల మేరకు విల్లాల నిర్మాణం మాత్రం చివరి దశకు తీసుకువచ్చారు. ఈ హామీని కూడా అమలు చేయకపోవడం వల్ల భూమిని రద్దు చేశారు.

'యువ పోరు'కు సమాధానం చెప్పి తీరుతాం

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్



వైసీపీ యువత పోరుకు సమానాధం చెప్పి తిరుతాం.

సిరిపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ యువత పోరుకు సమాధానం చెప్పి తీరుతామని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టరేట్ వద్దకు వచ్చి బహిరంగ చర్చకు తాము సిద్ధమన్నారు. వైసీపీ హయాంలో విద్యా రంగానికి చేసిన ద్రోహం గురంచి తాము మాట్లాడతామన్నారు. 9 నెలల కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో జరిగిన అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధమన్నారు.

రోడ్డ విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారు టీడీఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోండి

జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు

వెంకోజీపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో రోడ్డు విస్తరణ చేపట్టినపుడు స్థలాన్ని కోల్పోయినవారు టీడీఆర్ పోర్టల్‌లో సిటిజన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని, యూసర్ వేలిడేషన్ కోసం ఆధార్ , యూసర్ రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు దరఖాస్తు సమర్పించాలని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ విధంగా యూజర్ వేలిడేషన్ పూర్తయిన అనంతరం రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయిన వారు వారి పూర్తి యాజమాన్య హక్కు వివరాలు టీడీఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. అలా నమోదు చేసుకున్న తర్వాత నిబంధనలు ప్రకారం సదరు దరఖాస్తు పరిశీలించి టీడీఆర్ ఇచ్చే విషయమై పరిశీలిస్తామన్నారు. ఈ విషయంలో సందేహాలు ఉన్నట్టయితే సంబంధిత జోనల్ కార్యాలయాల్లోని అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లను, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ సిటీ ప్లానర్‌లను సంప్రదించాలని పేర్కొన్నారు.

చీటీల పేరిట మోసం : మహిళపై కేసు

ఎంవీపీ కాలనీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చీటీల పేరుతో మోసం చేసిన మహిళపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. శివాజీపాలెం ఆరు కుళాయిల ప్రాంతానికి చెందిన సరస్వతి పూర్ణామార్కెట్ ప్రాంతంలో దర్జీగా పని చేస్తోంది. అక్కడే పనిచేస్తున్న కుమారి తాను చీటీలు నిర్వహిస్తున్నానని చెప్పడంతో సరస్వతి తన పేరిట, తన తమ్ముడు పేరిట రూ. 30 వేలు, రూ.60 వేలు చొప్పున సుమారు 2.8 లక్షలు చెల్లించారు. చీటీలు పాడినా తిరిగి చెల్లించకపోవడం, అవసరం అంటూ కుమారి 17 గ్రాముల బంగారం కూడా తన వద్ద తీసుకున్నట్టు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

సినిమా గైడ్

- **శబ్దం:** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ(గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 27, టమాటా 14, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 42, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 36 దొండకాయలు 38, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)50, బరబాటి 36, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 34 చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 58, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176

కార్ల షోరూమ్ కోసం ప్రభుత్వ స్థలంలో నిర్మాణం

- బీఆర్టీఎస్ నిబంధనలకు పూర్తిగా విరుద్ధం
- పట్టించుకోని పట్టన ప్రణాళిక విభాగం అధికారులు

ఆరిలోవ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ 13వ వార్డులో ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దారాపాలెంలో జోరుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అయినా జీవీఎంసీ జోన్-2 పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది కనీసం స్పందించకపోవడంతో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. దారాపాలెంలో ఒక కార్ల ఏజెన్సీ వారు సుమారు 200 గజాల్లో నిర్మాణం చేపడుతున్నారు. ఇక్కడ ఓ కంపెనీ కార్ల నిర్మాణం ఏర్పాటు చేసేందుకు ఈ నిర్మాణాన్ని చేపడుతున్నట్టు తెలిసింది. బీఆర్టీస్ నిబంధనలకు తిలోదకాలిచ్చి ఫుట్‌పాత్‌ను అనుకొని ఈ నిర్మాణం చేస్తున్నారు. సాధారణంగా.. బీఆర్టీస్ నిబంధనల ప్రకారం సంబంధిత రోడ్డు నుంచి సుమారు 15 అడుగులు వదలి నిర్మాణాలు చేపట్టాలి. అయితే అలాంటి నిబంధనలేవీ ఇక్కడ పాటించడ లేదని ఈ నిర్మాణాన్ని చూస్తే ఇట్టే అర్థమవుతుంది. కనీసం ఒక్క అడుగు కూడా విడిచి పెట్టలేదు సరికదా ఫుట్‌పాత్ గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమించి మరీ నిర్మాణం చేపడుతున్నారు.

ఎవరైనా పేదవాడు నిర్మాణం చేపడితే.. నిబంధనల పేరిట క్షుణ్ణంగా పరిశీలించే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది ఈ విధంగా బడా సంస్థలు, పలుకుబడి ఉన్న వ్యక్తులు నిబంధనలు బేఖాతర్ చేస్తూ నిర్మాణాలు చేపట్టినా ఏ మాత్రం స్పందించరని స్థానికులు గుసగుసలాడుతున్నారు. ఈ నిర్మాణంలో అనేక లోపాలు ఉన్నాయన్న విషయం స్పష్టమవుతున్నా ఎలాంటి చర్యలు మాత్రం తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కడుతున్న అక్రమ నిర్మాణాల విషయంలో కఠిన వైఖరి అవలంబించాలని, లేదంటే కొన్నాళ్లకు ప్రభుత్వ స్థలాలు కనుమరుగయ్యే పరిస్థితి ఎదురవుతుందని అంటున్నారు.



13వ వార్డులోని ధారపాలెం వద్ద నిర్మిస్తున్న అక్రమ కట్టడం

ట్రాఫిక్‌కు ఇబ్బందిగా తోపుడుబండ్లు

- అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు అసంతృప్తి

ఆరిలోవ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలి, చినగదిలి, సంజయ్ గాంధీ కాలనీని రోడ్డు, చినగదిలి సాయిబాబా గుడి జంక్షనులో రోజు రోజుకూ తోపుడుబండ్ల సంఖ్య పెరిగిపోతోంది. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ఈ ప్రాంతాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

జోన్-2 కమిషనర్ ఈ ప్రాంతాలకు క్షేత్ర పర్యటనకు వచ్చిన ప్రతిసారీ బీఆర్టీఎస్ రోడ్డులో తోపుడు బండ్లు లేకుండా చేయాలని ఇక్కడి సిబ్బందిని ఆదేశిస్తుంటారు. కానీ ఆయన ఆదేశాలు అమలు కావడం లేదు.



ఈ ప్రాంతాల్లో చిరువర్తకులు తోపుడుబండ్లపై కూరగాయలు, కొబ్బరిబొండాలు, పండ్లు తదితరాలు విక్రయిస్తుంటారు. వీటిని కొనేందుకు కొనుగోలుదారులు వాహనాలు నిలిపి వేస్తుండడంతో ట్రాఫిక్‌నకు అంతరాయం కలుగుతోంది. బీఆర్‌టీఎస్ దాటి నిర్మాణాలు చేపడుతుండడంతో వేగంగా వస్తున్న వాహనాలు కొన్నిసార్లు నియంత్రించలేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జీవిఎంసి పట్టణ ప్రణాళిక సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు స్పందించి తమ ప్రాంతంలో తోపుడుబండ్లు నియంత్రించి, ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

జూ పార్కులో రెండో సింహం పిల్ల మృతి

- పుట్టినప్పటి నుంచి గోప్యత పాటించిన జూ అధికారులు
- జూ అధికారుల తీరుపై పలు విమర్శలు

ఆరిలోవ, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో సుమారు 15 రోజుల క్రితం సింహం రెండు పిల్లలకు జన్మనిచ్చింది, పుట్టిన పది రోజులకు ఒక సింహం పిల్ల మృతి చెందింది, కానీ ఈ విషయాలేవీ జూ అధికారులు బయట పెట్టలేదు. తాజాగా. ఇప్పుడు మరో పిల్ల కూడా మృతి చెందింది. ఈ విషయం కూడా జూ క్యూరేటర్ మంగమ్మ వద్ద ప్రస్తావించగా.. ఆమె 'మమ్మల్ని రచ్చ చేయకండి' అంటూ మండిపడ్డారు. రెండో సింహం పిల్ల మృతి విషయాన్ని చెప్పకుండా దాట వేశారు.

సాధారణంగా కళ్లు తెరవని పిల్లలకు జన్యుపరంగా అనేక రకాల వ్యాధులు సంక్రమించే పరిస్థితి ఉండడంతో వాటికి సంరక్షణకు అనేక జాగ్రత్తలు తీసుకుంటామని ఆమె చెప్పారు. కానీ సింహం పిల్లలు మృతి చెందినట్టు చెప్పలేదు.గతంలో ఒక పిల్ల మృతి చెందినట్టు రాశారని, కానీ, తాము నిర్ధారించలేదని పేర్కొన్నారు.

కాగా, జంతు ప్రదర్శన శాలలో జంతు వైద్యులు, సిబ్బంది పనితీరుపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారు జంతువుల సంరక్షణ విషయంలో అంత శ్రద్ధ తీసుకోవడం లేదని, వారంలో మూడు రోజులు సెలువుపైనే ఉంటారన్న ఆరోపణలు ఉన్నాయి. వీరికి బయట పెట్ క్లినిక్స్ ఉండడంతో జూలో విధి నిర్వహణపై అంతగా దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

పీహెచ్‌సీలో సేవలు పరిశీలించిన పాపులేషన్ రిసెర్చ్ సెంటర్ బృందం



ఎంవీపీ కాలనీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వైద్య విద్యా పరిషత్ ఆధ్వర్యంలో పాపులేషన్ రిసెర్చ్ సెంటర్ బృందం మంగళవారం పద్దెనిమిదో వార్డు పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని ప్రజా ప్రతినిధి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర రంగాల నుంచి కొందరిని ఈ బృందం వైద్య సేవలు, చైతన్యం, అవగాహన కార్యక్రమాలపై ఆరా తీసింది. ఆయా వ్యక్తుల నుంచి డేటాను సేకరించి, కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని ఢిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధులు పేర్కొన్నారు. మన రాష్ట్రంలో రెండు జిల్లాల్లో ఈ డేటా సేకరణ జరుగుతోందని, బాపట్ల, విశాఖపట్నం జిల్లాలను ఎంపిక చేసి, ఈ ప్రాంతాల్లో వైద్య సేవలు, పౌష్టికాహారం, వివిధ వ్యాధులు, అవగాహన వంటి విషయాలను ప్రజల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పద్దెనిమిదో వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి వైద్యులు పై రమణ, డాక్టర్ పడాలు, డాక్టర్ పద్మ, జీవీఎంసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సముద్ర జలాలు కలుషితం

బీచ్ రోడ్డు, మార్చి 12, (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డు పరిసరాలు వివిధ వ్యర్థాలతో కళ తప్పుతున్నాయి. ఆర్కే బీచ్, వైఎంసీఏ జంక్షన్ తదితర ప్రాంతాల్లో వ్యర్థాలను కుప్పలుగా పోస్తున్నారు. దీంతో పరిసరాలు దుర్గంధభరితమవుతున్నాయి. ఇక్కడకొచ్చే సందర్శకులు, పర్యాటకులు అసౌకర్యానికి లోనవుతున్నారు. నిత్యం సందర్శకులు, విద్యార్థులతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు డ్రైనేజీ నుచి సముద్రంలో కలుస్తోంది. కలుషితమైన సముద్రంలో సందర్శకులు వచ్చి స్నానాలు చేస్తున్నారు. మురుగునీరు బాగా కాలువల ద్వారా వ్యర్థాలెన్నో ప్రతిరోజూ సముద్రంలో కలుస్తున్నాయి. ప్లాస్టిక్ సీసాలు తదితరాలెన్నో సముద్ర జలాల్లో కలిసి కలుషితం అవుతున్నాయి. ప్రశాంత వాతావరణంలో గడిపేందుకు వస్తున్న సందర్శకులకు ఈ అపరిశ్రుభ వాతావరణం ఇబ్బందికరంగా ఉంటోంది. తీరంలో పలు చోట్ల డంపింగ్ యార్డులా మారింది.

రేషన్ సరకుల పంపిణీలో అలసత్వం వద్దు

- రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి

మద్దిలపాలెం, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థలో ఎలాంటి జాప్యం లేకుండా లబ్దిదారులకు సకాలంలో సరుకులు అందజేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె నగరంలోని పలు రేషన్ డిపోలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకాల అమలను పరిశీలించి అధికారులకుతగు సూచనలు చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారిణి కళ్యాణి, ఇతర అధికారులతో అశీల్‌మెట్ట సర్కిల్-2లోని రేషన్ డిపోను తనిఖీ చేశారు. డిపో డీలర్లకు కార్డుదారుల వివరాలుఅడిగి తెలుసుకున్నారు. కప్పరాడలోని అక్షయపాత్ర ఫౌండేషన్, యూపీహెచ్‌సీని సందర్శించి ఆహార నాణ్యతపై ఆరాతీశారు. జీవీఎంసీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతపరిశీలించి పిల్లలకు భోజనం వడ్డించారు. విద్యార్థులతో ముచ్చటించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరించారు. 54వ వార్డులోని నలందనగర్ అంగన్వాడీ కేంద్రం తనిఖీ చేసిఅక్కడ బాలింతలు, గర్భిణీలకు, చిన్న పిల్లలకు అందిస్తున్న పోషక ఆహారం, టెక్‌హోమ్ రేషన్, రిజిస్టర్‌లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం సందర్శించి విద్యార్థుల విద్యాభ్యాసం, టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణత అడిగి తెలుసుకున్నారు. అలాగే గురుకులంలో వంటశాల, భోజన నాణ్యతను పరిశీలించారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లై, ఐసీడీఎస్, విద్యాశాఖ, ఫుడ్‌సేఫ్టీ, తూనికలు కొలతలు శాఖాల అధికారులు పాల్గొన్నారు.



బియ్యం తనిఖీలు నిర్వహిస్తున్న గంజిమాల దేవి

మా స్థలాన్ని మాకు ఇప్పించండి

- కబ్జా చేసి తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారు..
- పెందుర్తి పోలీసులకు బాధితుల ఫిర్యాదు



సుజాతనగర్‌లోని వివాదాస్పద స్థలం (ఫైల్ ఫొటో)

పెందుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తాము కొనుగోలు చేసిన స్థలాన్ని కబ్జా చేసి, తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించి షెడ్డు, ప్రహరీ నిర్మాణం చేపట్టారంటూ బాధితులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. షెడ్డు, ప్రహరీని తొలిగించే యత్నం చేశామని తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేసి స్థలాన్ని వివాదాస్పదం చేసేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం బాధితుడు వి.రవివర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన తాను కుటుంబ సభ్యులతో కలిసి పెందుర్తి సమీపం సుజాతనగర్‌లో సర్వే నంబర్ 184-1లో 3,160 చదరపు గజాల స్థలానికి గల లింక్ డాక్యుమెంట్లను పరిశీలించి 2015లో ఓ న్యాయవాది వద్ద కొనుగోలు చేశామన్నారు 2016లో ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేశామన్నారు. పదేళ్ల నుంచి ఖాళీగా ఉన్న తమ స్థలాన్ని కొంతమంది అక్రమార్కులు కాజేయాలనే దురుద్దేశంతో ఈ స్థలాన్ని ఆనుకుని ఉన్న టీచర్స్ లేఅవుట్ ఉండ డంతో ఆ సొసైటీకి చెందిన ఓ ప్రతినిధితో కుమ్మక్కై కుట్రకు తెర తీశారన్నారు. ఇక్కడి స్థలం టీచర్స్ లేఅవుట్‌లోనిదేనని చూపుతూ తప్పుడు పత్రాలతో సింగిల్ బిట్‌గా ఉన్న తమ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి సొసైటీకి చెందనవని పేర్కొంటూ ఏడుగురి పేర్లతో గత ఏడాది పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేశారని తెలిపారు. రిజిస్ట్రేషన్ జరిపిన ప్లాట్ల నంబర్లు, టీచ ర్స్ సొసైటీ లేఅవుట్‌లోని మ్యాపులో గల ప్లాట్ల నంబర్లు ఒకటే కావడంతో వీటికి 2008లోనే ఇతరులు పేరిట రిజిస్ట్రేషన్లు జరిగినట్టు రిజిస్ట్రేషన్ కార్యా లయ ఈసీ ద్వారా తెలుసుకున్నామన్నారు. ఒకే నంబర్లు గల ఈ ప్లాట్లకు డబుల్ రిజిస్ట్రేషన్లు ఏ విధంగా జరిగాయో విచారణజరపాలంటూ అన్ని ఆధారాలను పోలీసులకు సమర్పించామన్నారు. తమకు చెందిన స్థలంలో షెడ్డు నిర్మించారన్న సమాచారంలో ఈ నెల 8న సుజాతనగర్ వచ్చి పరిశీలించగా.. స్థలమంతా చదును చేసి ఉందన్నారు. కరోనాతో హక్కుదారులు మృతి చెందారని ప్రచారం చేశారని స్థానికులు చెప్పడంతో ఖంగుతిన్నామన్నారు. గతంలో తాము నిర్మించిన ప్రహరీ ఒకపక్క మాత్రమే మిగిలి ఉందన్నారు.

దీనిపై అదేరోజు పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ ఆక్రమణలో విజయనగరం జిల్లాలోని నీటి పారుదల విభాగంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి ప్రమేయం, కింది స్థాయి పోలీస్‌అధికారి పాత్ర ఉందని రవివర్మ ఆరోపించారు.తమ స్థలాన్ని తప్పు డు పత్రాలతో ఆక్రమించి, రిజిస్ట్రేషన్లు జరిపిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని తమకు న్యా యం చేయాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. నగర పోలీస్ కమిషనర్‌కు కూడా దీని గురించి వివరించా మన్నారు.

చర్యలు చేపడతాం : సీఐ

దీనిపై సీఐ కేవీ సతీశ్‌కుమార్‌ను వివరణ కోరగా సుజాతనగర్‌లోని స్థల వివాదానికి సంబంధించి పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో సర్వే నంబర్‌పై స్పష్టత ఇవ్వాలని తహ శీల్దార్ కార్యాలయానికి లేఖ రాశామన్నారు. భూ వివాదంపై పీసీఎల్‌ఎఫ్ ద్వారా ముందస్తుగా సీపీకి వివరించామన్నారు. వాస్తవాలు నిర్ధారణ అయ్యాక చట్టపరమైన చర్యలుతీసుకుంటామని సీఐచెప్పారు.

కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలుచేయాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి



ధర్నాలో శిబిరం వద్ద మాట్లాడుతున్న సత్యనారాయణ మూర్తి

సిరిపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : దేశంలో సంపద సృష్టికర్తలైన అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐటీయూసీ జిల్లా సమితి చేసిన ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కార్మిక చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పీఎఫ్, ఈఎస్ఐ గ్రాడ్యుటీ సెలవులు వంటి అన్ని సౌకర్యాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అసంఘటితరంగ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.35 వేలు ఇవ్వాల్సిందేనన్నారు. కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలో రూ.50 కోట్ల మందిగా ఉన్న అసంఘటితరంగా కార్మికులకు ఒక సామాజిక భద్రతతో కూడిన చట్టాన్ని రూపొందించాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో మరిన్ని సమరశీల పోరాటాలకు ఏఐటీయూసీ సన్నద్ధమవుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాయకులు అచ్యుతరావు, మసీన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం : ఇద్దరికి తీవ్ర గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన కామేశ్వరరావు



గాయపడిన సత్యవతిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై మంగళవారం అనూహ్య ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ స్తంభం విరిగిపడడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాజువాక పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన బి.కామేశ్వరరావు (37) ఏదైనా ఉపాధి దొరుకుతుందేమోనన్న ఆశతో మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై విశాఖ డెయిరీకి బయలుదేరాడు. భెల్ హెచ్‌పీవీపీ వద్దకు చేరుకున్నాడు. డివైడర్ పక్కన వాహనం నిలిపాడు. అప్పటికే అక్కడ నాతయ్యపాలేనికి చెందిన డి.సత్యవతి (55) అనే మహిళ కూడా డెయిరీ వద్దకు వెళ్లేందుకు వేచి ఉంది. అదే సమయంలో గాజువాక నుంచి నగరంలోకి వెళుతున్న ఓ ఆర్టీసీ బస్సుకు తుప్పుపట్టిన ఇనుప విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్లు తగిలాయి. దీంతో ఒక్కసారిగా స్తంభం కూలి కామేశ్వరరావు, సత్యవతిలపై పడింది. కామేశ్వరరావు తలకు తీవ్ర గాయాలవ్వడంతో అపస్మారక స్థితికి చేరుకోగా, సత్యవతి తలకు, చేతికి గాయాలయ్యాయి. కామేశ్వరరావును కేజీహెచ్‌కు, సత్యవతిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కామేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు చెబుతున్నారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లేపాక్షి ఉత్పత్తుల ప్రదర్శన

సిరిపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్ ఎంపోరియం సిరిపురం, కేజీహెచ్ డౌన్‌రోడ్డు, విశాఖ విమానాశ్రయం తదితర శాఖల్లో వివిధ వస్తువులపై ప్రత్యేక రాయితీలు అందిస్తున్నట్టు లేపాక్షి వైస్ చైర్మన్ ఎం.విశ్వ ఒక ప్రకటనలో తెలిపారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, పెయింటింగ్స్, చీరలు, ఇతర వస్తువులు ప్రదర్శనలో ఉంచామన్నారు. ఈ నెల 31 వరకు అందుబాటులో ఉండే ప్రదర్శనలలో రాయితీ విక్రయాలు ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకుని చేతి వృత్తిదారులను ప్రోత్సహించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యం అయినట్లు ఫిర్యాదు అందింది. ఈ నెల 7న శివాజీపాలెం ప్రాంతానికి చెందిన వానపల్లి శంకర్రావు తమ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను సంప్రదించినా ఎలాంటి సమాచారం రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా పైడిమాంబ ఉత్సవం

ఆరిలోవ, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : పాత డెయిరీ ఫారం వద్ద వెలసిన గ్రామదేవత పైడి మాంబ అమ్మవారి ప్రధాన ఉత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. భక్తుల భక్తిశ్రద్ధలతో అమ్మవారిని వేకువ జాము నుంచి దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు.. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బారికేట్లను, ఏర్పాటు చేశారు.. వలింటీర్లు సహకారాలను అందించారు. ఎటువంటి ఇబ్బందులకు కలగకుండా పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రవీంద్ర నగర్ నుంచి అమ్మవారి గుడి వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. డప్పులు, తప్పెటగుళ్ల, నేల వేషాలు, పులి వేషాలు మధ్య ఈ ఊరేగింపు జరిగింది. కిలోమీటర్ల మేర భక్తులు నిలిచారు. భక్తుల కోసం పలు సంస్థలు మజ్జిగ, పులహోరా దద్దోజనం వంటి ప్రసాదాలను పంపిణీ చేశారు. పదో వార్డుకార్పోరేటర్ మద్దిల రామలక్ష్మి ఐస్ క్రీములను పంపిణీ చేశారు. శ్రీ ముఖలింగ కాళింగ సంఘంవారు పులహోరా, మజ్జిగ అందజేశారు. వివేకానందనగరకు చెందిన వైభవ ట్రావెల్ వారు సత్యనారాయణ స్వామి ప్రసాదాలు పులహోరా, బిర్యానీలు అందించారు. ఇలా చాలామంది ప్రసాదాలను వితరణ చేశారు. వైభవంగా అమ్మవారి ఉత్సవాలు ముగిశాయి. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెల్లకుండా పోలీసులు బంధోబస్తు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతగానో అలరించాయి.



అలంకరణలో పైడిమాంబ అమ్మవారు



ఆలయం వద్ద భక్తు సందడి

దుర్వాసనతో ఇబ్బందులు

ఆరిలోవ, మార్చి9 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసి పరిధికి చెందిన10 వ వార్డులో పాతడైరీ ఫారం సమీపంలెగ వివేకానంద కాలనీ పార్కు సమీపంలో చెత్తలు డస్ట్ బిన్‌నుండి పైకి వచ్చి గుట్లలు గుట్టలుగా ఉన్నది.చెత్నఉ ఆశించే కుక్కలు పందులవచ్చి వచ్చి చెత్తను చిందడి వందరగా చేయట వలన చెత్తలు రోడ్డు అంతా వ్యపించింది. దీనితో ఈ ప్రాంతం అంతా దుర్గంభరితంగా మారింది. పైగా ఈ డస్ట్‌బిన్ పార్కునకు ఆనుకొని ఉండుటవలన పార్కుకవస్తున్నవారు కూడా ఈ కంపును భరించలేక పోతున్నారు., కావున చెత్లను వెంటనే తొలగించాలని అంతా కోరుతున్నారు.

కంటిని కాపాడుకుందాం



- నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం
- 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి
- షుగర్, బీపీ వంటివి ఉన్నవారైతే 35 ఏళ్ల నుంచి...

కంటి చూపును పోగొట్టే గ్లకోమా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కంటి చూపును మెల్లగా పోగొట్టే వ్యాధి గ్లకోమా. ఆప్టిక్ నాడి దెబ్బతినడం వల్ల 'గ్లకోమా' వస్తుంది. ఏటా గ్లకోమా బారినపడి కంటి చూపు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది. దేశంలో లక్షలాది మంది గ్లకోమా బారినపడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కలిగించే ఉద్దేశంతో మార్చి 12న గ్లకోమా డే నిర్వహిస్తున్నారు. ఈ నెల పదో తేదీ నుంచి 16 వరకూ వారోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఐక్యంగా గ్లకోమా రహిత ప్రపంచాన్ని సాధిద్దాం అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

గ్లకోమాను నీటికాసుల వ్యాధి అని కూడా పిలుస్తారు. గ్లకోమా బారినపడిన వారిలో కనుపాప వద్ద గల ద్రవాల ప్రసరణలో అడ్డంకులు ఏర్పడి కంటి నరం ఒత్తిడికి గురై బలహీనపడుతుంది. దీనివల్ల క్రమంగా దృష్టి తగ్గి అంధత్వం ఏర్పడుతుంది. కంటిలో 12 లక్షల నరాలు ఉంటే అవన్నీ ఒత్తిడిని తట్టుకోలేక రోజుకు రెండు వేల నుంచి మూడు వేల వరకు చనిపోతుంటాయి. దీనివల్ల క్రమంగా చూపు మందగిస్తుంది. సాధారణంగా కంటిపై ఒత్తిడి 15 మిల్లీమీటర్ ఆఫ్ మెర్క్యురీ (ఎంఎంహెచ్‌జీ) వరకూ ఉండాలి. ఈ ఒత్తిడి ఎంత ఎక్కువైతే అంత వేగంగా అంధత్వం వస్తుంది. 20 ఎంఎంహెచ్‌జీకు చేరుకుంటే ఒత్తిడి పెరిగినట్టు భావించాలి. 40 దాటితే కంటి చూపు పోతుందని వైద్యులు చెబుతున్నారు. 20 దాటినప్పటి నుంచే అప్రమత్తం కావాలని సూచిస్తున్నారు. ప్రతి వంద మందిలో నలుగురు గ్లకోమా బారినపడుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

నరంపై ఒత్తిడి పెరిగితే...

కంటి ఆకృతిని పరిరక్షించడానికి యాక్వస్ హ్యూమర్ అనే ద్రవం కంట్లో ఉత్పత్తి అవుతుంది.

నేడు ప్రపంచ గ్లకోమా డే

కొత్త ద్రవం ఉత్పత్తి అయ్యే క్రమంలో పాత ద్రవం బయటకు వెళ్తుంది. బయటకు వెళ్లడంలో ఏదైనా అడ్డుపడితే అప్పుడు ఒత్తిడి పెరిగి నరం దెబ్బతింటుంది. దీనినే గ్లకోమా వ్యాధిగా చెబుతారు. ప్రతి ఒక్కరికీ నేరుగానే కాకుండా కొంత పక్కకు చూడగల సామర్థ్యం ఉంటుంది. దీనినే ఫీల్డ్ ఆఫ్ విజన్ లేదా విజువల్ ఫీల్డ్ అంటారు. గ్లకోమా వల్ల ఈ సామర్థ్యం క్రమంగా తగ్గిపోతుంది. ఇది ఒక్కరోజులో కాకుండా క్రమంగా జరుగుతుంది. అందుకే దీనిని సకాలంలో గుర్తించలేరు. అంధత్వ కారకాల్లో గ్లకోమా మూడో స్థానంలో ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.

గ్లకోమాకు అనేక అంశాలు దోహదం..

గ్లకోమా బారినపడేందుకు అనేక అంశాలు దోహదం చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. జన్యుపరమైన కారణాలు, గతంలో కంటి సమస్యలు, అలర్జీ పరిష్కారానికి స్టెరాయిడ్ డ్రాప్‌లు, టాబ్లెట్లు ఎక్కువ కాలం వినియోగించినా గ్లకోమా బారినపడే అవకాశం ఉంది. గ్లకోమా వల్ల ఆప్టిక్ నెర్వ్ (కంటి నెర్వ్) దెబ్బతింటే చూపు వచ్చే అవకాశం లేదు. ఒకసారి గ్లకోమా బారినపడితే కొంతమందిలో రెండేళ్లలో, మరికొంత మందిలో ఐదేళ్లలో చూపుపోయే అవకాశం ఉంది. కాబట్టి, 40 ఏళ్లు దాటినవాళ్లు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కళ్లలో నీరు కారడం, నల్లగుడ్డు తెల్లగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

ఈ పరీక్షలు తప్పనిసరి..

గ్లకోమా వ్యాధిగ్రస్తులకు సమగ్రమైన కంటి పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఇంట్రా ఆక్యులర్ ప్రెజర్ (జీవీటీ ద్వారా), గోనియోస్కోపీ, విజువల్ ఫీల్డ్ టెస్టింగ్, ఓసీటీ వంటి పరీక్షలను నిర్వహించి గ్లకోమాను నిర్ధారిస్తారు. ఎంత శాతం డ్యామేజ్ జరిగిందో నిర్ధారించి చికిత్స మొదలు పెడతారు.



తస్మాత్ జాగ్రత్త..

మధుమేహం, అధిక రక్తపోటు కలిగినవారు, 40 ఏళ్లు దాటినవారు, షార్ట్ సైట్ తరచూ పెరిగేవారు, కుటుంబ సభ్యుల్లో గ్లకోమా సమస్య ఉన్నవారు, స్టెరాయిడ్స్ మందులు వినియోగించేవాళ్లు, దృష్టిలోపంతో బాధపడేవారు, దెబ్బలు తగిలినవారు, స్మోకింగ్ అలవాటు ఉన్నవాళ్లలో గ్లకోమా వచ్చేందుకు అవకాశముంది. సెలక్టివ్ గ్రూపుగా చెప్పే ఇటువంటి లక్షణాలు ఉన్నవారిలో 20 ఏళ్లకే గ్లకోమా వచ్చే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. ఏడాదికొకసారి గ్లకోమా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.


ఓపీకి 30 మంది..

ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ప్రతిరోజూ నిర్వహించే ఓపీ (అవుట్ పేషెంట్స్)కి సుమారు 300 మంది వరకూ రోగులు వస్తే అందులో గ్లకోమా అనుమానితులు 30 వరకు ఉంటున్నారు. వారిలో నలుగురు నుంచి ఆరుగురికి నిర్ధారణ గ్లకోమా ఉంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. నెలకు ఆరు వేల మంది ప్రాంతీయ కంటి ఆస్పత్రికి వస్తుండగా, ఇందులో గ్లకోమా అనుమానిత కేసులు 500 వరకు ఉంటున్నాయి. వీరిలో 50 మంది వరకు నిర్ధారణ అవుతున్నట్టు చెబుతున్నారు. ప్రత్యేకంగా గ్లకోమా క్లినిక్‌ను ఆస్పత్రిలో నిర్వహిస్తున్నారు. గ్లకోమా నిర్ధారణ అయిన వారికి లేజర్ ట్రీట్‌మెంట్, అధికంగా ఉంటే ఐరడక్టమీ చేసి ఒత్తిడి పోయే మార్గాన్ని ఏర్పాటుచేస్తారు.



గ్లకోమా లక్షణాలున్న కన్ను

సాధారణ కన్ను



గ్లకోమా వ్యాధి వ్యాప్తి ఇలా..

40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికొకసారి పరీక్షలు చేయించుకోవాలి

- డాక్టర్ వి.మీనాక్షి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్



గ్లకోమాపై అవగాహన ఉంటే లక్షణాలను బట్టి సమస్యను గుర్తించి మెరుగైన వైద్య సేవలు పొందడం ద్వారా కంటి చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి కంటి పరీక్ష చేయించుకోవడం చాలా అవసరం. బీపీ, షుగర్, దృష్టిలోపం సమస్యతో బాధపడుతున్నవారైతే 35 ఏళ్లు దాటిన తరువాత నుంచి పరీక్షలు చేయించుకోవడం మేలు. సకాలంలో సమస్యను గుర్తించి వైద్య సేవలు పొందడం ద్వారా కంటి చూపు కోల్పోకుండా కాపాడేందుకు అవకాశం ఉంది. గతంతో పోలిస్తే కేసులు సంఖ్య పెరుగుతోంది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో స్పెషల్ గ్లకోమా క్లినిక్ నిర్వహిస్తున్నాం.

క్రైం... crime news

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయి సంచులతో ఆర్పీఎఫ్ సిబ్బంది

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.89,500 విలువ గల 17.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులతోపాటు గంజాయిని రైల్వే పోలీసులకు అప్పగించారు. రైల్వే పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తన సిబ్బందితో మంగళవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీ చేస్తున్న సమయంలో ఒడిశాలోని పాడువా ప్రాంతానికి చెందిన మాన్‌సింగ్ ఘోష్ (42), కృష్ణపాల్ (40) అనే నిందితులు ఎవరికీ అనుమానం రాకుండా ప్లాస్టిక్ చాపల మధ్య గంజాయి ప్యాకెట్లను పెట్టి ఉత్తరప్రదేశ్‌లోని నొయిడాకు తరలిస్తూ పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

డబ్బులు కాజేశాడని పూర్వ ఉద్యోగిపై ఫిర్యాదు

సీతంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమ సంస్థకు వచ్చిన డబ్బును ఫోన్ పే, నెఫ్ట్ ద్వారా కాజేశాడంటూ నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... అక్కయ్యపాలెంలోని శ్రీనిధి అసోసియేట్స్ సంస్థలో గతంలో భోగవరపు సత్య ధనరాజ్ మనీ ప్యూ పోర్ట్‌పోలియోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేశారు. అయితే గుట్టుగా సంస్థకు చెందిన వ్యక్తుల వద్ద డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో సంస్థ ఆ వ్యక్తిని ఉద్యోగం నుంచి తొలగించింది. అయితే ధనరాజ్ మళ్లీ కొంత మంది వద్ద సంస్థకు చెందిన ఫోన్ పే, నెఫ్ట్ ద్వారా డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం అందడంతో పాటు రూ.2,34,900 మోసపూరితంగా వసూలు చేసినట్లు గుర్తించారు. దీంతో అతనిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ రామకుమార్ అనే ఉద్యోగి నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మృతుడు లోకేశ్ (ఫైల్ ఫొటో)

గోపాలపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను యువతి తిరస్కరించిందన్న మనస్తాపంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన 89వ వార్డు పరిధి ఆదర్శనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదర్శనగర్‌కు చెందిన కొట్యాడ లోకేశ్ (20) అనే ఏసీ మెకానిక్ తల్లిదండ్రులు రామలక్ష్మి, శ్రీనివాసరావులతో కలిసి ఉంటున్నాడు. గతంలో సింహాచలం సమీపంలోని సింహపురికాలనీలో లోకేశ్ కుటుంబం ఉండేది. కొద్ది రోజుల క్రితమే వారు ఆదర్శనగర్ వచ్చారు. అయితే ఓ యువతిని లోకేశ్ ప్రేమించేవాడని, ఆమె తన ప్రేమను తిరస్కరించడంతో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి వచ్చిన లోకేశ్ తల్లిదండ్రులు తలుపులు వేసి ఉండడంతో ఎంతసేపు పిలిచినా ఎలాంటి స్పందన లేకపోవడంతో బలవంతంగా తలుపులు తెరిచి లోపలకు వెళ్లారు. లోకేశ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండడంతో విలపిస్తూ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడికి పదేళ్ల జైలు, జరిమానా

విశాఖపట్నం (లీగల్), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడు పొంగి బుల్లిరాజుకు పది సంవత్సరాల కారాగార శిక్ష, రూ.1,75,000 జరిమానా విధిస్తూ విశాఖపట్నం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మంగళవారం తీర్పు చెప్పారు. అంతేకాక మృతుని కుటుంబానికి రూ.1,60,000 పరిహారంగా ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పోలీస్ స్టేషన్ పరిధి బూరుగుచెట్టు గ్రామానికి చెందిన గెమ్మిలి లక్ష్మయ్యకు ముగ్గురు భార్యలు. ఇందులో మొదటి భార్య కుమారుడైన విజయకుమార్‌కు, మూడో భార్య తమ్ముడైన పొంగి బుల్లిరాజుకు కుటుంబ తగాదాలు ఉన్నాయి. 2019 ఏప్రిల్ 17న లక్ష్మయ్య గ్రామస్థులతో సమావేశమై ఇటుకల పండగ గురించి మాట్లాడుతుండగా ఆయన కుమారుడైన విజయకుమార్ వచ్చి తండ్రి చొక్కా పట్టుకుని ఇంటికి లాక్కుపోసాగాడు. దీంతో అక్కడే ఉన్న బుల్లిరాజు అడ్డుకున్నాడు. అయినా వదలకపోవడంతో పక్కనే కర్రతో విజయకుమార్ తలపై కొట్టాడు. గాయపడిన విజయకుమార్‌ను గ్రామస్థులు పాడేరు ఆస్పత్రికి, అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయకుమార్ మృతి చెందాడు. ఈ మేరకు పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో బుల్లిరాజుకు పైవిధంగా శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

వ్యక్తిని కొట్టి చంపిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగారం

కంచరపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని తలపై గాయపరిచి అతని మృతికి కారకుడైన నిందితుడికి న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2021లో కొండవీటి శివ అనే వ్యక్తి మరోవ్యక్తిని తలపై కర్రతో బలంగా కొట్టడంతో అతడు చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మరణించాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్టు చేశారు. విచారణకు వచ్చిన ఈ కేసులో నేరం రుజువుకావడంతో కొండవీటి శివకు విశాఖ రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి సి.కె.గాయత్రి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు నగర పోలీసు కమిషనర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

'స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించవద్దు'



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

అక్కయ్యపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును వెంటనే ఆపాలని సీఐటీయూ అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అక్కయ్యపాలెంలోని కేంద్ర కార్మికశాఖ ప్రాంతీయ కమిషనర్ కార్యాలయం ఎదుట మంగళవారం స్టీల్‌ప్లాంట్ అఖిల పక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఏళ్ల తరబడి 15 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరిలో అనేకమంది స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం తమ భూములను త్యాగం చేసిన నిర్వాసితులేనని చెప్పారు. వీరంతా ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని, దానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం చెబుతూనే ప్లాంట్ ప్రైవేటీకరణకు అనేక కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే 900 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, ప్రతి మూడు నెలలకు 1,400 మంది చొప్పున 5,600 మందిని తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర పన్నుతున్నాయన్నారు. తక్షణమే కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపాలని, కార్మికులందరికీ ఈఎస్ఐ, వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, జి.శ్రీనివాస్, నమ్మి రమణ, మంత్రి రవి, కె.వంశీ, ఉమ్మడి అప్పారావు, పి.భాస్కరరావు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా విశాఖ నగర పాలక సంస్థ
పబ్లిక్ నోటీసు

RC No. E-220180 Dt. 11-03-2025

[illegible] 60'-00" [illegible] 100'-0" [illegible] BRTS [illegible] G.O.Ms.No.136, MA&UD, dt. 8-11-2021 [illegible] G.O.Ms.No.119, dated 28-03-2017 [illegible]

S.no	RDP No.	Name of the applicant	Survey Number	Extent affected inSq.mts	Extent of TDR Proposed in Sq.mts
1.	11/2022 dt: 14.09.2022	M/s Godha Developers Rep by Its managing partner Sri Chaganti Govinda Raju & Dharmender Varada	80/1v of Yendada (V)	79.15	316.6
2.	11/2022 dt:14.09.2022	M/s Godha Developers Rep by Its managing partner Sri Chaganti Govinda Raju & Dharmender Varada	80/2E, 80/2F Parts of Yendada(V)	87.76	351.04
3.	01/2015 dt: 30.03.2015	Tatini Sitamaha Lakshmi	105/11 Kommadi Village Ward	168.82	675.28
4.	01/2015 dt: 30.03.2015	Ranganatham Vijaya and Others	2/Part Kommadi Village	127.83	255.66
5.	Rc.No:0112 96/2019/ ACP-I/GI	Gandi Isaac Bushan Kumar	60 of Chinagadili Village Ward	8.848	35.392
6.	Rc.No:0112 96/2019/ ACP-I/GI	Kalinga Parvathi	60 of Chinagadili Village Ward	16.66	66.64
7	Rc.No:0112 96/2019/ ACP-I/GI	Adada Sanyasi Rao	60 of Chinagadili Village Ward	15.71	62.84

[illegible]

Sd/- కమిషనర్, జి.వి.యం.సి.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **MARIAM UNISA BEGAM** (Old Name), W/o. Shaik Abdul Hussain, resident of 63-3-32/11, Jawahar Nagar, Sriharipuram, Malkapuram, Visakhapatnam. Change my name from **MARIAM UNISA BEGAM** (Old Name) to **MARIYAMUNNISA BEGUM** (New Name). Shall henceforth be known as **MARIYAMUNNISA BEGUM** (New Name), W/o. Shaik Abdul Hussain, for all purposes.
AJV_231276

CHANGE OF NAME

★ I, **REDDEM KHAKRAM** (Old Name), S/o. Reddem Sesharao, resident of 10-2-48, Gali Gangalamma Gudi veedhi, Pithapuram, Kakinada. Change my name from **REDDEM KHAKRAM** (Old Name) to **REDDEM CHAKRA RAO** (New Name). Shall henceforth be known as **REDDEM CHAKRA RAO** (New Name), S/o. Reddem Sesharao, for all purposes.
AJV_ 231277

CHANGE OF NAME

★ I Service No:14669433W, Rank: NK, Name: BHEEMUNI RAVI KUMAR S/o BHEEMUNI SANYSI RAO (LATE) R/O- Vill: JATTAPUREDDY TUNI & PO: NARASINGABILLI, TEHSIL -KASIMKOTA, DIST-ANAKAPALLE, Pin-531055, State - ANDHRA PRADESH, have changed my son name from B.LAKSHMI LALIT KUMAR (old name) to **BHEEMUNI LAKSHMI LALIT KUMAR** (new name) Affidavit No. IN-AP68896026223874X.
AJV_ 231278

SITUATION VACANT

★ రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)లో క్లౌడ్ కిచెన్‌లో తెలుగు శాఖాహార వంటకాలు వండడానికి అనుభవశాలియైన మగ వంటవారు కావాలి. జీతము వంట నైపుణ్యాలు పట్టి. సంప్రదించండి - "9425203443" AJH1808

కావలెను

రాజమండ్రి దగ్గరలో దేవరపల్లి దగ్గర గోపాలపురం అట్టల ఫ్యాక్టరీలో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. కరెంటు, నీటి వసతులతో రూమ్ ఫ్రీ. సెల్: 9397900495, 8143825822
AJD_207812

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

నైట్ షెల్టర్ల నిర్వహణ పారదర్శకంగా ఉండాలి

- జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు



టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నైట్ షెల్టర్లను తనిఖీ చేస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని రాత్రి ఆశ్రయ కేంద్రాల (నైట్ షెల్టర్ల) నిర్వహణ పారదర్శకంగా ఉండాలని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు నిర్వాహకులకు సూచించారు. నగర పరిధిలోని నైట్ షెల్టర్ల నిర్వాహకులకు బిల్లు చెల్లింపు అంశం గతంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం అజెండాలో పొందుపరచడంతో దీనిపై సభ్యులు లోతుగా చర్చించారు. నిర్వహణలో అవినీతి జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయని, సేవా దృక్పథంతో కేంద్రాలను నిర్వహిస్తున్నామంటూ ఒకే వ్యక్తి నాలుగు కేంద్రాలను ఎలా గుప్పిట్లో ఉంచుకున్నారని ప్రశ్నించారు. నైట్ షెల్టర్లను ప్రత్యక్షంగా పరిశీలించిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకోవాలని సభ్యులు అభిప్రాయపడడంతో ఈ అంశాన్ని వాయిదా వేశారు. త్వరలో జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఇదే అంశాన్ని అధికారులు అజెండాలో చేర్చే అవకాశం ఉండడంతో సభ్యులంతా సోమ, మంగళవారాల్లో టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నైట్ షెల్టర్లను తనిఖీ చేశారు. నిర్వహణ రికార్డులను పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు బొమ్మిడి రమణ, శరగడం రాజశేఖర్, విల్లూరి భాస్కరరావుతో పాటు యూసీడీ పీడీ సత్యవేణి పాల్గొన్నారు.

విశాఖ-పాట్నా మధ్య హోలీ ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హోలీ ప్రయాణికుల కోసం విశాఖ-పాట్నా మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08537 నంబరు గల రైలు ఈ నెల 16, 23, 30న (ప్రతి ఆదివారం) రాత్రి 7.30 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు పాట్నా చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08538 నంబరు గల రైలు ఈనెల 17, 23, 31న (ప్రతి సోమవారం) రాత్రి 10.30గంటలకు పాట్నాలో బయలుదేరి బుధవారం వేకువజామున 3.50 గం టలకు విశాఖ చేరుతుంది. విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగుడ, కెసింగ, టిట్లాగర్, బలంగీర్, బర్గర్ రోడ్డు, సంబల్‌పూర్, ఝార్సుగూడ, రౌర్కెలా, హటియా, రాంచీ, మురి, బొకారో స్టీల్ సిటీ, చంద్రపుర, గోమో, కోడెర్మా, గయ, జెహన్‌బాద్ మధ్య రాకపోకలు సాగిస్తాయన్నారు.

బెంగళూరు ప్రత్యేక రైలుకు జోలార్‌పేట స్టేషన్‌లో హాల్ట్

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హోలీ ప్రయాణికుల కోసం విశాఖ- ఎస్ఎంవీ బెంగళూరు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల సర్వీసులకు జోలార్‌పేట స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-బెంగళూరు (08549) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16 నుంచి, తిరుగు ప్రయాణంలో బెంగళూరు-విశాఖ (08550) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 17 నుంచి జోలార్‌పేట స్టేషన్‌లో హాల్ట్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక రైళ్లకు ఎలమంచిలి స్టేషన్‌లో ఒక నిమిషం, జోలార్‌పేట స్టేషన్‌లో పది నిమిషాలు హాల్ట్ సౌకర్యం కల్పించారు.

సచివాలయ ఉద్యోగులకు జాబ్ చార్టు ప్రకటించాలి

ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గణేష్‌కుమార్ డిమాండ్

మహారాణిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులకు స్పష్టమైన జాబ్ చార్టు ప్రకటించాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులను వివిధ విభాగాల్లోని ఖాళీల్లో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న నేపథ్యంలో ఆయన ఉద్యోగుల డిమాండ్లను ప్రస్తావించారు. సర్దుబాటు చేయగా మిగిలిన సిబ్బందిని మాతృశాఖకు బదిలీ చేయాలన్నారు. మంగళవారం ఎన్‌జీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అందరినీ ప్రభుత్వం జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించాలని, నిర్దిష్టమైన పదోన్నతి సౌకర్యం కల్పించాలని కోరారు. సీనియారిటీ జాబితా ప్రకటించాలని, విద్యార్హత మేరకు ఉద్యోగ ఖాళీల్లో వీరిని నియమించాలని సూచించారు. వార్డు పరిపాలనా కార్యదర్శులకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బందిని కేటగిరీల వారీగా విభజించాలనుకుంటే టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాలుగానే చూడాలని అభ్యర్థించారు. దివ్యాంగులకు సౌకర్యంగా ఉండే ఉద్యోగాలు మాత్రమే ఇవ్వాలని కోరారు.

ముగ్గురు సీఐల బదిలీ

రేంజ్‌కు భీమిలి సీఐ సుధాకర్ సరండర్

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. భీమిలి సీఐ బి.సుధాకర్‌ను రేంజ్‌కు సరండర్ చేశారు. టూటౌన్ సీఐ బి. తిరుమలరావును భీమిలి సీఐగా బదిలీ చేశారు. స్పెషల్ బ్రాంచి-1 సీఐగా పనిచేస్తున్న పి.పైడయ్యను త్రీటౌన్ సీఐగా నియమించారు. త్రీటౌన్ సీఐగా పనిచేస్తున్న పి.రమణయ్య డెప్యూటేషన్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి వెళ్లిపోయారు. భీమిలి సీఐ బి.సుధాకర్‌పై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతోపాటు, జాయ్‌జెమీమియా కేసులో సక్రమంగా వ్యవహరించలేదనే విమర్శలు ఉన్నాయి. అందువల్లే నాలుగు నెలలు కూడా కాకుండానే బదిలీ వేటు పడిందని ప్రచారం జరుగుతోంది. టూటౌన్ సీఐగా ఇంకా ఎవరినీ నియమించలేదు. ఒకటి, రెండు రోజుల్లో నగరంలో పనిచేస్తున్న పలువురు సీఐలకు స్థానచలనం ఉంటుందని పోలీస్ కమిషనరేట్ వర్గాలు చెబుతున్నాయి.

చిట్టీల పేరిట మోసం చేసిన ఇద్దరి అరెస్టు

మహారాణిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అల్లిపురంలో రూ.కోటికి పైగా చిట్టీల డబ్బులు వసూలు చేసి తప్పించుకు తిరుగు తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ తిరుమల రావు తెలిపారు. అల్లిపురానికి చెందిన కోరుకొండ మహేశ్వరి, ఆమె కుమారుడు సన్యాసి రావులు అల్లిపురం పరిసర ప్రాంతాలకు చెం దిన సుమారు 40 మంది నుంచి రూ.కోటికి పైగా డబ్బులు వసూలు చేసి పరారయ్యారు. మంగళవారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చెరకు లారీ బోల్తా

పెందుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సరిపల్లి హైవే వద్ద అధిక లోడుతో ప్రయాణిస్తున్న చెరకు లారీ మంగళవారం రాత్రి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సబ్బవరం నుంచి ఆనందపురం వెళ్తున్న ఈ లారీ సరిపల్లి ఎన్‌హెచ్-16 వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. అధికంగా చెరకును లోడ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు.